ప్రజాశక్తి

ఆదివారం 10 డిసెంబర్ 2023 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

గుంటూరు ఛానల్‌ను ఆధునీకరిస్తాం

- వైసిపి ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ముంపు
- పెదనందిపాడులో తుపాను బాధితులను పరామర్శించిన చంద్రబాబు
- తమనెవ్వరూ పట్టించుకోలేదని వాపోయిన రైతులు

మాట్లాడుతున్న చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి/పెదనందిపాడు

నల్లమడ డ్రెయిను, గుంటూరు ఛానల్‌ను ఆధునీకరించి ముంపు నుంచి కాపాడతామని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. శనివారం రాత్రి ఆయన పెదనందిపాడు ప్రాంతంలో పర్యటించారు. తుపాను వల్ల నష్టపోయిన పొలాలను పరిశీలించారు. మధ్యాహ్నం 3 గంటలకు పెదనందిపాడు రావాల్సి ఉండగా రాత్రి 10 గంటల ప్రాంతంలో వచ్చారు. పెదనందిపాడులో ప్రజలు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. ప్రత్యేక వాహనంపై చంద్రబాబు పెదనందిపాడులో పర్యటించారు. ప్రజలకు అభివాదం చేసుకుంటూ ముందుకు సాగారు.

వాహనం వద్ద రైతులు తుపాను వల్ల దెబ్బతిన్న మిర్చి పైరును తీసుకువచ్చి చంద్రబాబుకు చూపారు. నాలుగున్నర ఏళ్లుగా డ్రెనేజి వ్యవస్థను పట్టించుకోకపోవడం వల్ల పంటలకు అపారనష్టం జరిగిందని రైతులు చంద్రబాబు దృష్టికి తీసుకు వచ్చారు. వైసిపి హయంలోరైతులకు న్యాయం జరగడం లేదని తెలిపారు. ప్రత్తిపాడుకు చెందిన సాంబశివరావు మాట్లాడుతూ టిడిపి వచ్చిన తరువాత రైతులకు న్యాయం చేయాలని కోరారు. కాకుమానుకు చెందిన మహిళ పద్మజ మాట్లాడుతూ తమను ఇంతవరకు ఎవ్వరూ పట్టించుకోలేదన్నారు. కాల్వలకు గండ్లు పడినా పట్టించుకోలేదన్నారు. పొలాల్లో మోకాలిలోతు నీరు ఉందన్నారు. కాకుమాను మండలం మొత్తం పొలాలన్నీ నీట మునిగాయన్నారు. ఎకరాకు రూ.70 వేలు పెట్టుబడి పెట్టామని పెదనందిపాడుకు చెందిన రైతు విన్నవించారు. నష్టం అంచనాలను ఇంకా రూపొందించలేదన్నారు. రాజకీయాలకు అతీతంగా నష్టపరిహారం అందేలా చూడాలన్నారు. పాలపర్రుకు చెందిన మహిళ మాట్లాడుతూ 15 ఎకరాల పొగాకు సాగు చేశామని వర్షాలకు పంటమొత్తం మునిగిపోయిందని అన్నారు. తమ గ్రామంలో రైతులు పూర్తిగా నష్టపోయారన్నారు. గుంటూరు ఛానల్ పొడిగిస్తామని చెప్పిన సిఎం ఇంత వరకుపట్టించుకోలేదన్నారు. కాకుమాను మండలం బికె పాలేనికి చెందిన మహిళ మాట్లాడుతూ వరి 10 ఎకరాల్లో సాగు చేశామని మొత్తం మునిగిపోయిందన్నారు.

పెదనందిపాడు ప్రధాన కూడలిలో జరిగిన సభలో చంద్రబాబు ప్రసంగిస్తూ రైతులను రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. టిడిపి హయాంలో గుంటూరు ఛానల్ ఆధునీకీకరణకు ఇచ్చిన ఆదేశాలను వైసిపి ప్రభుత్వం పట్టించుకోకుండా ఈ పనులను గాలికి వదిలేసిందన్నారు. రైతులను ఆదుకునేందుకు టిడిపి కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వంపై వత్తిడి తెస్తామన్నారు. పులిచింతల, పట్టిసీమ ద్వారా సకాలంలోనీరు ఇచ్చి టిడిపి హయాంలో నీటి యాజమాన్య పద్ధతులను సమర్ధవంతంగా చేయడం వల్ల పంటలను తుపాను బారిన పడకుండా కృషి చేశామన్నారు. పట్టిసీమ ద్వారా డెల్టాను సస్యశ్యామలం చేశామన్నారు. గోదావరి నీటిని పెన్నా నదితో అనుసంధానం చేసేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. సాగర్ కాల్వలకు గోదావరినీటిని తెచ్చేందుకు ఐదుఎత్తిపోతల ద్వారా పనులకు టిడిపి హయంలో శ్రీకారంచుట్టామన్నారు. వీటిని వైసిపి ప్రభుత్వం గాలికి వొదిలేసిందన్నారు. టిడిపిహయంలో గుంటూరు ఛానల్ పొడిగింపు,విస్తరణకురూ.350కోట్లతో పనులకు శంఖుస్థాపన చేయగా వైసిపి ప్రభుత్వంనిర్లక్ష్యం చేయడం వల్ల ఈ ప్రాంతం ముంపునకు గురైందన్నారు. రాత్రి 11 గంటల వరకు చంద్రబాబుసభ కొనసాగింది. టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి బూర్ల రామాంజనేయులు, జిల్లా అధ్యక్షులు తెనాలి శ్రావణ్ కుమార్, మాజీమంత్రి మాకినేనిపెద రత్తయ్య, జనసేన జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్ర, ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహంపై మూత్రం

మద్యం సేవించిన దుండగుని దుశ్చర్య

దుండగుణ్ణి అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

మద్యం మత్తు తలకెక్కిన వ్యక్తి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం పట్ల తీవ్ర అనుచితంగా ప్రవర్తించాడు. శనివారం సాయంత్రం పూటుగా మద్యం తాగిన నిడుబ్రోలుకు చెందిన వ్యక్తి పొన్నూరు పట్టణం అంబేద్కర్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్దకు వచ్చి హల్‌చల్ చేశాడు. విగ్రహం మెట్లు ఎక్కి చొక్కా విప్పేసి బహిరంగంగా మూత్ర విసర్జన చేశాడు. అంబేద్కర్‌ను ఉద్దేశించి అనుచితంగానూ మాట్లాడినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇదంతా చూసిన కొందరు ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో పోలీసులు అక్కడికి చేరుకుని అదన్ని స్టేషన్‌కు తీసుకెళ్లారు. వ్యక్తి ప్రవర్తనను నిరసిస్తూ దళిత సంఘాలు గంటపాటు రాస్తారోకో చేశాయి. దుండగుణ్ణి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశాయి. ట్రాఫిక్ నిలిచిపోవడంతో ఆందోళనకారులకు పోలీసులు చర్చించారు. చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన ముగిసింది.

మాట్లాడుతున్న బాబూరావు

తుపాను బాధిత రైతుల్ని ఆదుకోవాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాబూరావు

ప్రజాశక్తి-గుంటూరు

తుపాను వల్ల నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సి.హెచ్.బాబూరావు డిమాండ్ చేశారు. శనివారం బ్రాడీపేటలోని సిపిఎం కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా విస్తృత సమావేశం నిర్వహించారు. సమావేశానికి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు అత్యక్షత వహించగా బాబూరావు మాట్లాడుతూ జిల్లాలో తుపాను కారణంగా షుమారు లక్ష ఎకరాల వరిపంట తీవ్రంగా దెబ్బతిన్నదని, పంట చేతికొచ్చే సమయానికి నీటిపాలై దిగుబడి తగ్గే ప్రమాదం ఏర్పడిందని చెప్పారు. తడిసిన ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా మద్దతు ధరకు కొనగోలు చేయాలన్నారు. వరితోపాటు జిల్లాలో మిర్చి, పత్తి, శనగ, అరటి, పసుపు, కంద, ఉల్లి,

▶ 2లో

మాట్లాడుతున్న శ్రీధర్

తప్పుల్లేని ఓటర్ల జాబితా లక్ష్యం

జిల్లా రోల్ అబ్జర్వర్ శ్రీధర్

ప్రజాశక్తి-గుంటూరు

ఓటర్ల జాబితాలో అర్హులందరినీ నమోదు చేయటంతోపాటు, చనిపోయిన, శాశ్వతంగా వలస వెళ్లిన, మల్టీపుల్ ఎంట్రీ ఉన్న వారి ఓట్లను తొలగించి స్వచ్ఛీకరించిన ఓటర్ల జాబితాను రూపొందించటమే ప్రధాన లక్ష్యంగా ఎన్నికల కమిషన్ స్పెషల్ సమ్మరీ రివిజన్‌ను నిర్వహిస్తోందని ఏపి పోల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబరు సెక్రటరీ, ఎస్ఎస్ఆర్ 2024 జిల్లా రోల్ అబ్జర్వర్ బి.శ్రీధర్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఎస్ఎస్ఆర్-2024 జిల్లా రోల్ అబ్జర్వర్ బి.శ్రీధర్, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, జేసీ జి.రాజకుమారి, నగర కీర్తీ చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మతో కలసి రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఓటరు నమోదు అధికారులు, అసిస్టెంట్ ఓటరు నమోదు అధికారులతో సమావేశం

▶ 2లో

మృతదేహాల తరలింపులో నిర్లక్ష్యం

- మహాప్రస్థాన వాహనాల సంఖ్య తగ్గింపు
- కేవలం ఏడు వాహనాలకే పరిమితం
- లోపభూయిష్టంగా ఎంఒయు

ఆస్పత్రి వాహనంలో మృతదేహాన్ని తరలిపజేస్తున్న జిజిహెచ్ సూపరింటెండెంట్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్) నుంచి మృతదేహాల తరలింపు ప్రహసనంగా మారింది. పలుకుబడి, సిఫార్సులు ఉంటేనే ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న మహాప్రస్థాన వాహనంలో మృతదేహాలను తరలిస్తున్నారు. లేదంటే వేలాది రూపాయాలు వెచ్చించి ప్రైవేటు వాహనాలను సమకూర్చుకోవాల్సి వస్తోంది. ఈవిషయంలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడింది. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ కూడా పట్టించుకోవడం లేదు.

జిజిహెచ్‌కి రోజుకు మూడు వేలు నుంచి నాలుగు వేల మంది రోగులు వస్తుంటారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రోజుకు 10 నుంచి 20 మందికి పైగా మృతి చెందుతున్నారు. మృతదేహాలను వారి స్వగ్రామాలకు తరలించాలంటే కనీసం 15 మహా ప్రస్థాన

▶ 2లో

సమీక్షలో మాట్లాడుతున్న జెసి రాజకుమారి

20 ఏళ్లు దాటిన అసైన్డ్ భూములను నిషేధిత జాబితా నుండి తొలగించాలి

ప్రజాశక్తి-గుంటూరు

సిసిఎల్ఎ నూతనంగా జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం 20 ఏళ్లకు పైబడిన అసైన్డ్ భూములను నిషేదిత జాబితా నుంచి తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని తహశీల్దార్లకు జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలిశర్మ, డిఆర్ఒ కె.చంద్రశేఖర్‌రావు, ఆర్డీవో శ్రీకర్‌తో కలసి తహశీల్దార్లతో సమీక్షించారు. 20 ఏళ్ల పైబడిన అసైన్డ్ భూములను నిషేదిత జాబితా నుంచి తొలగించే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. జగనన్న భూహక్కు-భూరక్ష కార్యక్రమం ద్వారా జిల్లాలో చేపడుతున్న రీసర్వేను షెడ్యూల్ ప్రకారం వేగవంతం చేయాలన్నారు. ఎస్ఎస్ఆర్ 2024కు సంబంధించి అందిన క్లెయిమ్స్‌ను రాష్ట్ర ఎన్నికల అధికారి జారీ చేసిన నూతన సూచనల ప్రకారం పరిష్కరించేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

కొండవీడు కోటలో జిల్లా అటవీశాఖ అధికారి రామచంద్రరావు

చారిత్రక కట్టడాలను పునరుద్ధరిస్తాం

ప్రజాశక్తి-యడ్లపాడు

కొండవీడుకోటలో శిథిలమైన చారిత్రక కట్టడాలను పునరుద్ధరించేందుకు పల్నాడు అటవీశాఖ యోచిస్తోందని పల్నాడు జిల్లా అటవీ శాఖ అధికారి ఎన్.రామచంద్రరావు అన్నారు. కొండవీడు కోట ప్రాంతాన్ని ఆయన శనివారం సందర్శించారు. చారిత్రాత్మకంగా ముఖ్యమైన, ఎక్కువగా సందర్శించే తూర్పు ప్రవేశ ద్వారం పునరుద్ధరణ కోసం చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. ఆ తర్వాత ఇతర చారిత్రక కట్టడాలను పునరుద్ధరించనున్నామన్నారు. పునరుద్ధరణ పనుల కోసం తమిళనాడు నుండి నిపుణులైన కార్మికులను తెప్పిస్తామన్నారు. పరిశీలనలో నరసరావుపేట ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వెంకట రమణ, కొండవీడు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రాజు, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విశిష్ట సేవలందిస్తున్న కేర్‌వెల్ హాస్పిటల్

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక గుంటూరువారితోట 7వ లైన్ లోని కేర్‌వెల్ హాస్పిటల్ గుంటూరు పరిసర ప్రాంతాల్లో పేదలకు లివర్ సమస్యలపై ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి సేవలు చేస్తున్నట్లు డయాబెటాలజిస్ట్,గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ ప్రముఖ డాక్టర్ నాగూర్ బాషా అన్నారు. శనివారం ఆసుపత్రి ఆవరణలో జరిగిన వైద్య శిబిరంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా కేర్‌వెల్ హాస్పిటల్ యాజమాన్యానికి పేషంట్స్ కతజ్ఞతలు తెలిపారు. సుమారు 70 మందికి రూ.10 వేలు విలువ చేసే ఫైబ్రో స్కాన్ ద్వారా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసినట్లు షేక్ గౌస్ బాషా తెలిపారు. ఈ అవకాశాన్ని పేదలు ఉపయోగించు కున్నందుకు తమకు సంతోషంగా ఉందని అన్నారు. మరో వైద్య శిబిరం ఎప్పుడు ఏర్పాటు చేసేది త్వరలో తెలియజేస్తామని చెప్పారు. మరిన్ని వివరాలకు 8341713713, 9854757999 నంబర్లలో సంప్రదించాలని చెప్పారు.

తుపాను బాధిత రైతుల్ని ఆదుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

మినుము పంటలు కూడా దెబ్బతిన్నాయన్నారు. వ్యాపార పంటలకు ఎకరానికి రూ.50 వేలు, వరికి రూ.25 వేలు నష్టపరిహారం ఇవ్వాలని, ఈ-క్రాప్‌తో సంబంధం లేకుండా కౌలు రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని, రబీకి విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు ఉచితంగా అందించాలని, పేద రైతులకు రుణాలు రద్దు చేయాలని కోరారు. ఈ మేరకు తీర్మానాన్ని సమావేశం ఆమోదించింది. సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ భూముల్లో ఇళ్లేసుకుని నివాసముంటున్న పేదలకు ప్రభుత్వం వెంటనే ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని, అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని, వీటికోసం నిధులు కేటాయించాలని కోరారు. గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించాలని జరుగుతున్న ఆందోళనలకు సంపూర్ణ మద్దతు తెలిపారు. గతంలో చంద్రబాబు నాయుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి గుంటూరు ఛానల్ పొడిగింపునకు నిధులు కేటాయిస్తామని వాగ్దానం చేశారని, నిధులు మాత్రం కేటాయించలేదని విమర్శించారు. వెంటనే నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం మరోసారి విద్యుత్ ఛార్జీలు పెంచేందుకు సన్నద్ధమవుతోందని, స్మార్ట్ మీటర్ల పేరుతో విద్యుత్ ఛార్జీలు పెంచబూనుకుంటోందని అన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించే ప్రయత్నాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.నళినీకాంత్, వై.నేతాజి, ఎన్.భావన్నారాయణ, ఎం.రవి, ఎస్-ఎస్.చెంగయ్య పాల్గొన్నారు.

మృతదేహాల తరలింపులో నిర్లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

వాహనాలు అవసరమని అధికారులు గతంలోనే గుర్తించారు. ప్రస్తుతం ఏడు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. వాహనాల సంఖ్య పెంచాలని మహాప్రస్థానం సంస్థ నిర్వాహకులు ఆస్పత్రి అధికారులు కోరినా పట్టించుకోలేదు. రాత్రి సమయాల్లో తమ వాహనాలను వినియోగించలేమని ఖరాఖండిగా చెబుతున్నా అధికారులు చర్యలు తీసుకోలేదు. మృతదేహాలను తమ స్వగ్రామాలకు తరలించాలని వత్తిళ్ల చేస్తున్నారని, మహాప్రస్థానం వాహనాలను అందుబాటులో ఉంచాలని కోరుతున్నారని ఆయన చెప్పారు. అనేకమార్లు గొడవలు కూడా చేస్తున్నారన్నారు. ఆస్పత్రి ఉన్నతాధికారుల సిఫార్సులుంటేనే పంపిస్తున్నారని, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు సిఫార్సు చేసినా లెక్క చేయడం లేదనే ఆరోపణలున్నాయి. మృతదేహాలను తీసుకెళ్లకుంటే మార్చురీలో ఉంచేందుకు అవకాశం లేదని చెబుతుండడంతో ఇదే అదనుగా భావించి ఆసుపత్రి చుట్టూ ఆవహించి ఉన్న ప్రైవేట్ అంబులెన్స్‌లు అవసరార్థుల నుండి వేలాది రూపాయలు వసులు చేస్తున్నారు.

ఆస్పత్రిలో చనిపోయిన వారి మృతదేహాలను స్వగ్రామానికి పంపిస్తామని ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న మహాప్రస్థానం సంస్థ ఈ సదుపాయాన్ని నీరుగారుస్తోంది. అంతేగాక గుంటూరు జిల్లా వరకే తమ వాహనాలను పరిమితం చేస్తామని చెప్పడం, ఇతర జిల్లాల వారికి ఇబ్బందికరంగా మారింది. తాజాగా నాలుగు నెలల పాటు వైద్య సేవలు పొందుతూ శనివారం మృతి చెందిన వెంకట సుబ్బయ్య మృతదేహాన్ని సొంతూరైన కడప జిల్లాలో చెన్నూరు మండలంలోని కొత్తూరుకు తీసుకెళ్లేందుకు మహాప్రస్థానం నిర్వాహకులు నిరాకరించారు. ప్రైవేటు అంబులెన్స్‌ను సంప్రదించగా వారు రూ.25-30 వేలవుతుందని చెప్పడంతో మృతుని బంధువులు అంత ఆర్థిక స్థోమత లేక ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్‌ను సంప్రదించారు. ఆయన మహాప్రస్థానం సంస్థ జోనల్ మేనేజర్‌తో సంప్రదించినా ఫలితం లేకపోవడంతో చివరకు ఆసుపత్రికి చెందిన ప్రభుత్వ అంబులెన్స్‌లో తరలించారు.

తప్పుల్లేని ఓటర్ల జాబితా లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించారు. సమావేశంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, ఆప్ నాయకులు డాక్టర్ టి.సేవాకుమార్, బిఎస్‌పి నాయకులు సిహెచ్. వాసు, బిజెపి ఆర్.భాస్కరరావు, కాంగ్రెస్ నుండి బి.సునీల్, టిడిపి కార్యాలయ సెక్రెటరీ కె.శివరామయ్య, వైసిపి జిల్లా అధ్యక్షులు డొక్కా మాణిక్యవరప్రసాదు తదితరులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఒక పార్లమెంట్ నియోజకవర్గం, ఏడు అసెంబ్లీ . నియోజకవర్గాలు ఉన్నాయన్నారు. ఎస్ఎస్ఆర్ 2024 డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా ప్రదర్శన అక్టోబర్ 27 నాటికి జిల్లాలో 17,35,619 మంది ఓటర్లు ఉన్నారని ఈపీ రేషియో 716, జండర్ రేషియో 1066 ఉందన్నారు. స్వీప్ కార్యక్రమం ద్వారా కొత్త ఓటర్ల నమోదుకు సుమారు 13000 మందితో దరఖాస్తులు చేయించినట్లు చెప్పారు. ఓటర్ల జాబితాకు సంబంధించి వివిధ రకాల క్లెయిమ్‌లు 3,83,325 అందాయని, వాటిలో ఇప్పటికే 3,22,816 పరిష్కరించినట్లు చెప్పారు. మిగిలినవీ పరిష్కరించి జనవరి 5 నాటికి తుది జాబితా విడుదల చేస్తామన్నారు. జీరో డోర్ నంబరు, జంక్ క్యారక్టర్లున్న 354 ఓట్లలో 330 సవరించామని, 24 ఓట్లు సాంకేతిక సమస్యలు వలన సవరించలేదని అన్నారు. ఒకే ఇంటిపై 10కి మించి నమోదైన ఓట్లు 7055 ఇంటి నంబర్లలో 1,04,172 ఉన్నట్లు గుర్తించామని, వీటిని పూర్తి స్థాయిలో వెరిఫికేషన్ చేసి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. రోల్ అబ్జర్వర్ బి.శ్రీధర్ మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న ఎస్ఎస్ఆర్ 2024లో ప్రచురించిన తుది జాబితా ప్రాతిపదికనే రానున్న సార్వత్రిక ఎన్నికలు నిర్వహిస్తున్నందున ఎన్నికల సంఘం మరింత ఎక్కువుగా జాగ్రత్తలు తీసుకుంటుందన్నారు. తుది జాబితాలో తప్పులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, అన్ని క్లెయిమ్‌లనూ క్షేత్రస్థాయిలోని బూత్ లెవల్ అధికారులు సక్రమంగా పరిశీలించాలన్నారు. సమావేశంలో రాజకీయ పార్టీలు తెలిపిన అంశాలపై కలెక్టర్ స్పందిస్తూ 20 ఏళ్లు దాటిన వారు నూతనంగా ఫారం 6 ద్వారా ఓటు నమోదు చేసుకోవాలంటే, ఇప్పటి వరకు ఎందుకు ఓటు నమోదు చేసుకోలేదో తెలిపాలని, ఇప్పటి వరకు ఎక్కడ ఓటు నమోదు చేసుకోలేదని డిక్లేరేషన్ ఇవ్వాల్సి ఉంటుందని ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు జారీ చేసిందని తెలిపారు. నూతన ఓట్ల నమోదు పోలింగ్ బూత్‌లో 4 శాతం కంటే ఎక్కువుగా ఉంటే ఏఈఆర్వో స్వయంగా వెళ్లి పరిశీలిస్తారన్నారు. సొంత ఇల్లు ఉన్నంత మాత్రాన ఓటు నమోదు చెయ్యరని, కచ్చితంగా సాదారణ నివాసి అని పరిశీలనలో తెలితేనే ఓటు నమోదు చేస్తారని చెపాపరు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని డీఎస్ నగర్‌లో ఉన్న వారికి కనిగిరిలోనూ ఓట్లు ఉండటంపై క్షేత్ర స్థాయిలో పరిశీలన చేశామని, వాటి ప్రకారం చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. సమావేశంలో డిఆర్ఒ కె.చంద్రశేఖర్‌రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రవీంద్రరావు, ఆర్డీవో కె.శ్రీకర్ పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రాకు మైదానాల గుర్తింపు

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి తాడేపల్లి పట్టణాల్లో 12 మైదానాలను గుర్తింపు, సదుపాయాల కల్పనపై కార్పొరేషన్ కమిషనరు వి.నిర్మల్ కుమార్ పరిశీలించారు. అనంతరం కార్పొరేషన్ సెక్రటరీ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు పరిశీలించారు. చినకాకాని జెడ్‌పి పాఠశాల, సికె హైస్కూల్, మంగళగిరి ప్లే గ్రౌండ్లలో నిల్వ ఉన్న నీటిని సత్వరమే తొలగించాలని ఆదేశించారు. పరిశీలనలో కార్పొరేషన్ సెక్రటరీ పి.శ్రీనివాసరావు, డిఇఇ ఎస్-ఎస్ఆర్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పరిధి రెండింతలైనా 30 ఏళ్ల నాటి సిబ్బందే

- పని ఒత్తిడిలో చిలకలూరిపేట పోలీసులు
- 16 వార్డుల నుండి 38 వార్డులకు పెరిగిన పట్టణం
- 9 కిలోమీటర్ల నుండి 18 కిలో మీటర్లు అయిన విస్తీర్ణం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పట్టణం విస్తరించినా.. నేరాలు పెరుగుతున్నా.. పోలీసు సిబ్బందికి పని భారం పెరుగుతున్నా వారి సంఖ్యను మాత్రం పెంచడం లేదు.

చిలకలూరిపేట పట్టణంలో గతంలో 16 వార్డులు ఉండగా ఇటీవల మరికొన్ని ప్రాంతాలను కలిపి 38 వార్డులకు విస్తరించారు. గతంలో సుమారు 9 చదరపు కిలోమీటర్ల వరకు ఉండే విస్తీర్ణం తాజాగా రెండింతలై 18 చదరపు కిలోమీటర్లకు పెరిగింది. మున్సిపాల్టీ పరిధిలోని జనాభా సైతం గతంలో 50 వేల లోపుంటే ఇప్పుడది 80 వేలకు పెరిగింది. ఈ నేపథ్యంలోనే పట్టణ పోలీస్‌స్టేషన్‌ను మోడల్ స్టేషన్‌గానూ రూపుదిద్దారు. అంతా బాగానే ఉన్నా సిబ్బందిని మాత్రం పెంచలేదు. 30 ఏళ్ల కిందట ఎంతమంది సిబ్బంది ఉన్నారో ఇప్పటికీ అంతమందే ఉన్నారు. మరోవైపు పట్టణ పరిధి పెరగడంతోపాటు జాతీయ రహదారి కావడంతో చోరీలు, ఇతర చట్ట వ్యతిరేక కార్యకలాపాలు పెరిగాయి. ద్విచక్ర వాహన చోరీలు, ఇళ్లల్లో దొంగతనాలు ఎక్కువయ్యాయి. సిసి కెమెరాలు కూడా తక్కువగా ఉండడంతో నిందితుల గుర్తింపు, కేసును ఛేదించడం పోలీసులకు కష్టంగా మారింది. దీంతో పోలీస్ సిబ్బందిపై పనిభారం పెరిగి మానసికంగానూ తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు.

ప్రస్తుతం పట్టణంలో 35-40 మంది వరకు కానిస్టేబుళ్లు, 13 మంది హోంగార్డులు ఉన్నారు. 50 ఇళ్లకు ఒక వాలంటీర్, ప్రతి గ్రామ, వార్డు సచివాలయంలో సిబ్బందిని నియమిస్తున్నట్లే పోలీస్‌స్టేషన్లకూ జనాభాకు అనుగుణంగా సిబ్బందిని కేటాయిస్తే తమకు పనిభారం తప్పుతుందనే అభిప్రాయం పోలీసుల నుండి వ్యక్తమవుతోంది. దీనికితోడు తమకిచ్చే జీతమూ అత్తెసరేనని, పెరిగిన ధరలతో బతకడం కష్టంగా ఉందని హోంగార్డులు అంటున్నారు. ఇదిలా ఉండగా మోడల్ పోలీస్‌స్టేషన్‌కు ప్రత్యేకంగా ఇవ్వాల్సిన నిర్వహణ ఖర్చులూ రావడం లేదని పోలీసులు చెబుతున్నారు. ప్రత్యేకంగా సెలవులేమీ లేని తమకు గతంలో అదనంగా 45 రోజుల జీతాన్ని ఏడాది చివరిలో ఇచ్చేవారని, నాలుగేళ్లుగా వాటినీ ఇవ్వడం లేదని, టిఎ, డిఎలు కూడా నిలిచాయని పోలీసులు చెబుతున్నారు.

లారీ వెనుక టైరులో మంటలు

ప్రజాశక్తి-తాడేపల్లి

విజయవాడ మంగళగిరి పాత జాతీయ రహదారిపై శనివారం లారీ వెనుక టైర్ల దగ్గర ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్ లారీని వెంటనే నిలుపుదల చేయడంతో పెను ప్రమాదం తప్పింది. వెనుక లారీ నుంచి మంటలు రావడంతో స్థానికులు చూసి పెద్దఎత్తున కేకలు వేయడంతో ఐరన్ లోడ్‌తో వెళ్తున్న లారీకి పెద్ద ప్రమాదం తప్పినట్లు అయ్యింది. స్థానికుల సహాయంతో మంటలు ఆర్పడంతో ఎటువంటి ప్రమాదము, నష్టము వాటిల్లలేదు.

ఉద్యోగుల పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలి

ప్రజాశక్తి-తెనాలి

ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను తక్షణమే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తెనాలి శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్ శ్రీనివాసరావు, కె సౌజన్య డిమాండ్ చేశారు. స్థానిక జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో సమావేశ మందిరంలో అసోసియేషన్ బందం శనివారం సమావేశమై ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులకు పెండింగ్ లో ఉన్న సరెండర్ లీవ్, మెడికల్ లీవ్ బిల్లులను వెంటనే చెల్లించాలని, పి. ఆర్. సి.కి సంబంధించిన ఐ. ఆర్.ను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ నెల 17 వ తేదీన జరిగే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల జిల్లా అసోసియేషన్ ఎన్నికలపై చర్చించారు. సమావేశంలో అసోసియేషన్ ట్రెజరర్ జి.విజయ లక్ష్మి, వైస్ ప్రసిడెంట్స్ డి. సుధీర్ బాబు, ఏ.రామచంద్రరావు, డి.శ్రీనివాసరావు, అసోసియేట్ ప్రెసిడెంట్ యస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సమావేశంలో ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ సభ్యులు

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - నూజెండ్ల

నూజెండ్ల మండలంలో శుక్రవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకా రం మండలంలోని గురప్పనాయుడు పాలెం వద్ద 2 బైకులు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో రవ్వారం గ్రామానికి చెందిన తల్లీ కొడుకులకు, గురప్ప నాయుడుపాలెంకు చెందిన మరొక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. తల్లి, కుమారుడిని వినుకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తర లించారు. మరోక వ్యక్తిని మెరుగైన వైద్యం కోసం గుంటూరు ఆసుపత్రికి తరలించారు.

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన సంఘటనలో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు.ఈ సంఘటన సత్తెనపల్లి మండలం మురళీనగర్ సమీపంలో శనివారం జరిగింది. అనుపాలెం నుండి గుడిపూడి వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని గుంటూరు నుండి మాచర్ల వెళుతున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా ఢీకొట్టడంతో బైక్ మీద ప్రయాణిస్తున్న అనుపాలెం గ్రామానికి చెందిన మిరియాల నారాయణరావు తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని 108 వాహనం ద్వారా సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నర్సరావుపేట తరలించారు.సత్తెనపల్లి సత్తెనపల్లి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మనస్థాపంతో యువతి ఆత్మహత్య

ప్రజాశక్తి-నాదెండ్ల

తల్లి మందలించిందని మనస్థాపనతో ఎలుకల ముందు తిని యువతి మృతి చెందిన సంఘటన మండలానికి గణపురం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది నాదెండ్ల ఎస్సై బలరాంరెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం గణపవరానికి చెందిన నావూరి శివ చిన్న కూతురు అఖిల(19) చిలకలూరి పేట లోని ప్రైవేట్ హాస్పిటల్‌లో నర్సుగా పని చేస్తోంది. ఈ నెల 3వ తేదీన డ్యూటీ విషయమై ఆమె తల్లి మంద లించింది. తన తల్లి ఎప్పుడూ తిడుతోందని మనస్థాపం చెంది న అఖిల, ఎలుకల మందును కూల్ డ్రింక్ లో కలుపుకొని తాగింది. జిజిహెచ్ లో చికిత్స పొందుతున్న ఆమె శనివారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్యాస్ లీకై ప్రమాదం.. ఫర్నీచర్ బుగ్గిపాలు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని చిర్రావూరు గ్రామానికి చెందిన మట్లపూడి మరియమ్మ ఇంట్లో శనివారం ఉదయం ప్రమాదవశాత్తు గ్యాస్ లీకైంది. ఈ ప్రమాదంలో ఇంట్లోని ఫర్నిచర్ అంతా బుగ్గి పాలైంది. ఈ విష యం తెలుసుకున్న టిడిపిగ్రామ నాయకులు మరియమ్మ నివాసానికి వెళ్లి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. తెలుగు దేశం జాతీయ కార్యదర్శి నారా లోకేష్ సహ కారంతో బాధితురాలికి పది వేల రూపా యలను తెలుగుదేశం తాడేపల్లి మండల అధ్యక్షులు ఎ.సుబ్బారావు, గ్రామ టిడిపి అధ్యక్షులు వి.శ్రీనివాసరావు అందజేశారు.

కుళాయిల నుండి మురుగునీరు

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి పట్టణ పరిధిలో తాగునీటి సమస్య పరిష్కారం కావడం లేదు. పైప్ లైన్ లీకేజ్ సమస్య అడుగడుగునా వెంటాడుతోంది. నగరంలోని పాత బస్టాండ్ సెంటర్‌లోని రవి స్వీట్ షాప్ వద్ద పైపు లైన్ లీకేజ్ ఏర్పడింది. దీంతో శనివారం కుళాయిల ద్వారా మురుగు నీరు సరఫరా అయిందని ఆ ప్రాంత ప్రజల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే నాలుగు రోజులకు ఒకసారి తాగునీరు సరఫరా చేస్తున్నారని, అది కూడా మురుగునీరే దిక్కవుతోందని ఆవేదన చెందారు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు స్పందించి లీకేజ్ ను అరికట్టాలని వారు కోరుతున్నారు.

మహారాజశ్రీ చిలకలూరిపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టు
ఈ.పి.80/2020 ఇన్ ఓ.ఎస్.నెం.25/2019

బిట్వీన్
పొట్టి ఉమా మహేశ్వరి ...వాది/డి.హెచ్.ఆర్

Vs

1.యమ్/ఎస్.హరి ప్రియ టౌన్‌షిప్స్ మరియు డెవలపర్స్ Rep by its managing partner, వేల్పూరి శ్రీనివాసరావు
2.వేల్పూరి శ్రీనివాసరావు, తండ్రి .నాగేశ్వరరావు R/o. Door No.5-37-148, 4/17 బ్రాడీపేట, గుంటూరు. ...ప్రతివాది/జె.డి.ఆర్

పై నెంబర్ గల దావాలో మీరు ప్రతివాది/జె.డి.ఆర్ అయి వున్నారు. శ్రీ కోర్టు వారి నుంచి ఎన్ని పర్యాయములు సమన్లు పంపినను ఉద్దేశ్యపూర్వకముగా మీరు తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారము ఈ పత్రికా ప్రకటన ద్వారా పై కేసు తేది:15-12-2023వ తేదిన వాయిదా ఉన్నదని తెలియజేయడమైనది. కావున వాయిదా రోజున ఉదయం 10-30 నిమిషములకు శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, వకీల్ ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియచేసుకోవలసినది. లేనిచో మీ పరోక్షమున వాయిదా తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము)
వాయిదా తేది:15-12-2023

డి.వి.నాగరాజు,
డి.హెచ్.ఆర్ తరపు న్యాయవాది,
చిలకలూరిపేట.

IN THE HIGH COURT OF ANDHRA PRADESH AT AMARAVATI
M.A.C.M.A. 482 of 2023

Between:
1.Alla Parvathi, W/o Srinivasa Rao, Hindu, aged about 51 years, House Wife, R/o Perecharla(V), Medikondur(M), Guntur District-522438, A.P.
2.Alla Srinivasa Rao, S/o Parasu Ramaiah Hindu, aged about 57 years, House Wife, R/o Perecharla(V), Medikondur(M), Guntur District-522438, A.P. ...Petitioners

And

1.Karnati Srinivasa Rao, S/o Ramanadham, R/o D.No.13-1-182/1, Opp.MRO Office, Main Road, Macherla Town, Guntur District-522426 (Owner of the Vehicle-10 Tyre Lorry No.AP07Y5967)
2.National Insurance Company Ltd., Rep.by its Branch Manager, O/o.D.No.09-80 Lavanya Complex, Besides Kapil Chit Funds Piduguralla Town, Guntur District-522413. (Originally Policy No.566013311510001160 Valid from 20-07-2015 to 19-07-2016)
3.Puppala Ravi Kumar, S/o Ramdas, Hindu, aged about 56 years, Driver, R/o. PWD Colony, Macherla Town, Guntur District. (Driver of the Vehicle-10 Tyre Lorry No.AP07Y5967) ...Respondents

Please take notice that above named appellants filed above M.A.C.M.A. against the above named respondents before the Hon'ble High Court of A.P. at Amaravati challenging the award dated 30-01-2023 in the M.V.O.P. 466/2017 on the file of Motor Vehicle Accidents Claims Tribunal cum Principle District Court, Guntur and whereas, as per the order Hon'ble High Court, notices sent to the above respondents were served on the respondents 1 and 2 whereas notice sent to respondent number 3 was returned with an endorsement 'insufficient addressee' and whereas this Hon'ble Court directed the appellant to take out notice by way of paper publication to the respondent number 3 on or before 22-12-2023 and the above appeal stands posted to 29-12-2023.

3rd respondent is hereby informed that if he fails to appear either in person or through counsel in M.A.C.M.A. 482/2023 before the Hon'ble High Court of A.P. at Amaravati on 29-12-2023, the matter may be decided on the basis of the material available on record.

AMARAVATI,
Date:07-12-2023

M.Pitchaiah,
Advocate,
High Court of Andhra Pradesh-Amaravati

GENERAL NOTICE
In the Court of the Prl. Senior Civil Judge: Guntur
SOP No: 79 / 2023

Between :
1)Manugunta Kavitha,W/o. Balaji Nehru, 2) Manugunta Bhargavi, D/o. Balaji Nehru, both are R/o. D.No.8-19/1-288, Ambedkar Nagar, 2nd lane, Guntur. ...Petitioners

And

1)Life Insurance Corporation of India, Rep. by its branch Manager, Amaravathi Road, Branch No.706, Guntur, 2)The Sr. Divisional Manager, Life Insurance Corporation of India, Jeevan Prakash Building, Divisional Office, Machilipatnam, Krishina Dt.,3)Life Insurance Corporation of India, Rep. by its Branch Manager, Proddutur Branch, Opp. 1 Town P.S., Ammavarisala, Proddatur 085642 51071, Cuddapah, 4)Munuguntu Lakshmi Devi, W/o.Subbarayudu, R/o. 3/33-A, Uppathivaripalli, Kongalaveedu, Kadapa, Andhra Pradesh. ...Respondents

పైనెంబరు యస్.ఓ.పి.లోని పిటీషనర్ల 1వ వారికి భర్త, 2వ వారికి తండ్రి గారైన మనుగుంట బాలాజీ నెహ్రూ గారు జీవించియున్న కాలంలో 1 & 3వ రెస్పాండెంట్స్ వద్ద ది.28-03-2008 & ది.15-09-2004న తీసుకున్న ఇన్సూరెన్స్ పాలసీ నెం.655213973 & 653321723గా నమోదుచేసుకొని యున్నారు. కావున సదరు రెస్పాండెంట్స్ కంపెనీల వద్ద నుండి పాలసీ మొత్తం తీసుకొనుటకు పిటీషనర్‌లను వారసులుగా గుర్తించమని కోరుచూ పై కోర్టువారి నందు వారసత్వ సర్టిఫికేట్ కొరకు పిటీషన్ దాఖలు చేసుకొనగా సదరు పిటీషన్‌పై ఎవరికైనా ఏవిధమైన అభ్యంతరములు ఉన్నయెడల తెలుపుకొన వలసినదిగా శ్రీకోర్టువారు జనరల్ నోటీసు నిమిత్తం **ది.12-01-2024**నకు వాయిదా వేసినారు. కావున ఆరోజు **ఉ॥గం॥10-30** ని॥లకు అభ్యంతరములు ఉన్నవారు పై కోర్టువారి ఎదుట హాజరై వారికిగల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో శ్రీ కోర్టువారిచే చట్టప్రకారం తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

లక్కిశెట్టి ప్రసాద్, పిటీషనర్ల తరపు అడ్వకేట్,
రామనామ క్షేత్రం దగ్గర, గుంటూరు. సెల్: 9848590033

వేలం ప్రకటన
మహారాజశ్రీ తెనాలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
EP. 36/2023 in OS. 73/2021

Between:-
Pathan Bajikhan, Tenali ...DHR

And

1.Adusumalli Vijaya
2.Adusumalli Jhansi Burripalem Village ...JDR's

పై నెంబరు EP లో ఈ దిగువ షెడ్యూలు దాఖలా JDR's యొక్క స్థిరాస్తిని పై కోర్టువారిచే ది. 29-12-2023 వ తేది ఉదయం గం.10-30 ని॥ల లగాయతు వేలం వేయబడును. కావలసిన వారు వేలంపాటలో పాల్గొని పాడుకొనవచ్చును.

<u>షెడ్యూలు</u>

Guntur District, Tenali Regd.District Tenali sub.Dist, Tensli Mandal, Burripalem Village, D.No.226/8, A.C.0.91 Cents bounded by:-
East: Paruchuru Kasi Viswanadham Property
South: A.Purnachandra Rao Property
West: Galli Bazaar
North: Adusumalli Satyannarayana Property
Within these boundaries an extent of 206sq yards or 175.25 sq.mts of Vacant site with all easementary rights etc.
DHR Value Rs 4,00,000/-
Amina Value Rs 10,00,000/-
Sale date:29-12-2023
Note:EC దాఖలా అన్యాక్రాంతములు లేవు

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో)

J.Siva Ganesh,
DHR తరపు అడ్వకేటు,
తెనాలి,
సెల్ నెం.7893096457.

మహారాజశ్రీ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు నరసరావుపేట
Creditor IP No.86/2023

Between:
Muthineni @ Mutinedi Srinu, S/o Ramaiah, R/o Padmati Bazaar, Darsi Town & Mandal, Prakasam District. ...Petitioner

And

1)Vanguri Anathanaidu @ Nayudu, S/o Pedda Venkaiah, R/o Nuzendla Grama Panchayat & Mandal, Planadu Dist.
2)Vanguri Prasanna Kumar, S/o Anatha Nayudu, R/o Nuzendla Grama Panchayat & Mandal, Planadu Dist.
3)Vanguri Ashok Nayudu, S/o Anatha Nayudu, R/o Nuzendla Grama Panchayat & Mandal, Planadu Dist.
4)Vanguri Prasad, S/o Chiranjeevi, R/o Nuzendla Grama Panchayat & Mandal, Planadu Dist.
5)The Official Receiver, Court Complex, Guntur, Guntur Dist. ...Respondents

పై నెంబరు Creditor IP లోని మొదటి రెస్పాడెంట్‌ను ఇన్సాల్వెంట్‌గా డిక్లర్ చేయమని కోరుతూ పైన చెప్పిన పిటీషనర్ ఈ పిటిషన్‌ను దాఖల చేయగా సదరు పిటీషన్ పై ఏమైన అభ్యంతరాలు ఉన్న యెడల తెలుపుకొనవలసినదిగా శ్రీ కోర్టు వారు ది. 28-12-2023 వ తేదికి వాయిదా వేసియున్నారు. కావున ఆ రోజు ఉదయం గం॥ 10-30 ని॥లకు పైన తెలిపిన శ్రీ కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, మీ తరుపున లాయరు గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలయును. లేనిచో మీ పరోక్షమందు తీర్మానించబడును.

శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం
వాయిదా:28-12-2023

జెట్టి తిరుపతి రావు,
దార్ల బుజ్జిబాబు,
పిటీషనర్ తరుపున న్యాయవాదులు,
నరసరావుపేట.

మహారాజశ్రీ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు నరసరావుపేట
Creditor IP No.78/2023

Between:
1) Thumati Satyam S/o Lakshmaiah, Door No.6-56, Kotha Nagireddypalli Village, Nuzendla Mandal, Palnadu DIst.
2) Nadendla Venkata Narasaiah, S/o Seethaiah, Kotha Nagireddypalli Village, Nuzendla Mandal, Palnadu DIst.
3) Avulamanda Venkateswarlu, S/o Puttanna, Kotha Nagireddypalli Village, Nuzendla Mandal, Palnadu DIst.
4) Nadendla Nageswara Rao, S/o Edukondalu, Kotha Nagireddypalli Village, Nuzendla Mandal, Palnadu DIst.
5) Avulamanda Venkateswarlu, S/o Venkaiah, Kotha Nagireddypalli Village, Nuzendla Mandal, Palnadu DIst.
6) Vinukonda Balamma, W/o Rosaiah, Dondapadu Village, Nuzendla Mandal, Palnadu DIst. ...Petitioner

And

1) Parimi Sobhana Babu, S/o Chinna Subbaiah, R/o Door No.6-132, Kotha Nagireddypalli Village, Nuzendla Mandal, Palnadu DIst.
2)Parimi Ravi, S/o Sobhana Babu, Age 14 years,
3)Parimi Manikanta, S/o Sobhana Babu, Age 16 years,
R2 & R3 being minors Represented by his Gurdian & Grand Mother Parimi Venkata Ramulu, W/o Chinna Subbaiah, R/o Kothanagireddypalli Village, Nuzendla Mandal, Palnadu Dist.
4)The Official Receiver, Court Complex, Guntur, Guntur Dist. ...Respondents

పై నెంబరు Creditor IP లోని మొదటి రెస్పాడెంట్‌ను ఇన్సాల్వెంట్‌గా డిక్లర్ చేయమని కోరుతూ పైన చెప్పిన పిటీషనర్ ఈ పిటిషన్‌ను దాఖల చేయగా సదరు పిటీషన్ పై ఏమైన అభ్యంతరాలు ఉన్న యెడల తెలుపుకొనవలసినదిగా శ్రీ కోర్టు వారు ది. 14-12-2023 వ తేదికి వాయిదా వేసియున్నారు. కావున ఆ రోజు ఉదయం గం॥ 10-30 ని॥లకు పైన తెలిపిన శ్రీ కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, మీ తరుపున లాయరు గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలయును. లేనిచో మీ పరోక్షమందు తీర్మానించబడును.

శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం
వాయిదా:28-12-2023

జెట్టి తిరుపతి రావు,
దార్ల బుజ్జిబాబు,
పిటీషనర్ తరుపున న్యాయవాదులు,
నరసరావుపేట.

అధికారులకు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

నష్టపరిహారం కోసం వినతి

ప్రజాశక్తి - బెల్లంకొండ

తుపాను నేపథ్యంలో పంటలు దెబ్బతిన్న రైతులందరికీ నష్టపరిహారం ఇవ్వాలని సిపిఎం మండల కార్యదర్శి సిహెచ్.పుల్లారావు కోరారు. ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయంలో శనివారం వినతిపత్రం ఇచ్చారు. సందర్భంగా పుల్లారావు మాట్లాడుతూ నష్టపోయిన పంటను సత్వరమే అంచనా వేయాలన్నారు. రైతులు ఇప్పటికే రూ.లక్షలు ఖర్చుపెట్టారని, ఇంటిల్లపాది పొలంలో పని చేశారని, పంట చేతికొచ్చే సమయంలో తుపాను విరుచుకుపడిందని ఆవేదన వెలిబుచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రవిబాబు, నాయకులు బి.నరసింహారెడ్డి, దుర్గారావు పాల్గొన్నారు.

వివాదాస్పదంగా అంగన్వాడీ కార్యకర్త పోస్టు భర్తీ

ప్రజాశక్తి - ముప్పాళ్ల : మండల కేంద్రమైన ముప్పాళ్లలోని అంగన్వాడీ కార్యకర్త పోస్ట్ వివాదాస్పదంగా మారింది. ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సత్తెనపల్లి పరిధిలో అంగన్వాడీ పోస్టుల ఖాళీలకు ఇటీవల నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ పోస్టుల్లో ముప్పాళ్ల ఎస్సీ కాలనీలోని అంగ న్వాడీ కార్యకర్త పోస్టు కూడా ఉండడంతో స్థానిక ఎస్సీ కాలనీ లోని మహిళలు దరఖాస్తు చేసుకున్నారు. వారికి ఇటీవల ధ్రువపత్రాల పరిశీలనా పూర్తయింది. ఇక్కడే అసలు సమస్య మొదలైంది. దరఖాస్తు చేసుకున్న మహిళల్లో ఒకరు తమకు అన్యాయం జరుగుతుందంటూ పల్నాడు జిల్లా ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ముప్పాళ్ల సర్పంచ్.. అతని కుటుంబ సభ్యులకు అంగన్వాడీ కార్యకర్త పోస్టు ఇప్పించుకునేందుకు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని, రాజకీయ పలుకుబడిని ఉపయోగించుకుని అధికారులను ప్రలోభ పెడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరారు.

పెన్షనర్ల భవనం ఖాళీకి అంగీకారం

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్ : తమ కార్యాలయ భవనంలోని గదుల్లో పయనీర్ ఆటోమొబైల్ నిర్వాహకులు అక్రమంగా నిర్వహిస్తున్న షాపును ఖాళీ చేయాలని తాము 26 రోజులుగా ఆందోళన చేస్తున్న నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీల చొరవతో సమస్య శనివారం పరిష్కారమైందని పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. ధర్నా వద్దకు చేరుకున్న వివిధ రాజకీయ పార్టీ నేతలు షాపు నిర్వాహకులను పిలిపించి చర్చించిన మీదట షాపును ఖాళీ చేయటానికి వారు అంగీకరించి వెనువెంటనే వారి సమక్షంలోనే షాపును ఖాళీ చేసే పనులు చేపట్టారని చెప్పారు. సమస్య పరిష్కారానికి సహకరించిన అంరదికి పెన్షనర్లు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, వైసిపి నాయకులు యర్రం వెంకటేశ్వరరెడ్డి, సిపిఎం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య, కాంగ్రెస్ నాయకులు జ్ఞాన్ రాజ్ పాల్, అంబేద్కర్ ప్రజాసంఘం అధ్యక్షులు డి.కోటేశ్వరరావు, జె.పాలరాజ్, జె.శేఖర్, అసోసియేషన్ నాయకులు ఆర్.పురుషోత్తం, చంద్రయ్య, హనుమంతరావు, జె.లక్ష్మీనారాయణ, మురహరిరావు, పోతులురయ్య, శృంగారం, కె.రంగారెడ్డి, ప్రసాద్, రంగరెడ్డి, ఎల్.సుబ్బారావు, వెంకటాద్రి పాల్గొన్నారు.

నేడు ఎంఎకె దత్ సంస్మరణ సభ

ప్రజాశక్తి - అమరావతి : యుటిఎఫ్ సీనియర్ నాయకులు శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్ మాజీ హెచ్ఎం ముదునూరు అక్షయ కుమార్ దత్ సంస్మరణ సభ ఆదివారం ఉదయం నిర్వహిస్తామాని విశ్రాంత హెచ్ఎం కొల్లి లక్ష్మీనారాయణ శనివారం తెలిపారు. సభ అమరావతిలోని శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్లో ఉదయం 9.30 గంటలకు ఉంటుందని పేర్కొన్నారు.

అత్యంత పారదర్శకంగా ఓటరు జాబితా

- అధికారులకు పల్నాడు జిల్లా పరిశీలకులు బి.శ్రీధర్ ఆదేశం
- రాజకీయ పార్టీలు, అధికారులతో సమీక్ష - ఫిర్యాదుల స్వీకరణ
- వైసిపి నేతల ఒత్తిడితో ఓట్లను తొలగిస్తున్నారని టిడిపి ఫిర్యాదు

సమీక్షలో మాట్లాడుతున్న పల్నాడు జిల్లా పరిశీలకులు బి.శ్రీధర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఓటర్ల జాబితా తయారీ అత్యంత పారదర్శకంగా జరగాలని, దొంగ ఓట్లను, మృతి చెందిన వారి ఓట్లను తొలగించాలని ఎలక్టోరల్ అబ్జర్వర్, ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, పల్నాడు జిల్లా పరిశీలకులు బి.శ్రీధర్ ఆదేశించారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్పందన హాల్లో రాజకీయ పార్టీలు, అధికారులతో శనివారం సమీక్షించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, డిఆర్ఒ వినాయకం పాల్గొన్నారు. ఓటర్ల జాబితాపై వివిధ రాజకీయ పార్టీలకున్న సందేహాలను అడిగి తెలుసుకుని నివృత్తి చేశారు. అనంతరం కలెక్టర్ విలేకర్లతో మాట్లాడారు. సమీక్షలో రాజకీయ పార్టీల నాయకులు వారి నియోజకవర్గాల పరిధిలోని సమస్యలను వివరించారని, వారి నుండి ఎలక్టోరల్ అబ్జర్వర్ వినతులు స్వీకరించి వాటి పరిష్కారానికి ఆదేశించారని చెప్పారు. ఆ సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని, ఈ మేరకు ఇఆర్వోలు, ఎఇఆర్వోలకు ఆదేశాలిచ్చామని చెప్పారు. ఇప్పటివరకు పరిష్కరించిన సమస్యలను, పరిష్కరించాల్సిన సమస్యలను మీడియాకు వివరించారు.

ఇదిలా ఉండగా పల్నాడు జిల్లాలో ఓట్ల నమోదు మార్పులు చేర్పుల్లో భారీ అవతవకలు జరిగాయని ఎన్నికల సంఘం అధికారి వద్ద టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జివి ఆంజనేయులు, మాచర్ల, నరసరావుపేట నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు జూలకంటి బ్రహ్మారెడ్డి, డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు ఆధారాలతో సహా ఫిర్యాదు చేయగా సంబంధిత అధికారులపై ఎలక్టోరల్ అబ్జర్వర్ అయిన శ్రీధర్ ఆగ్రహం వ్యక్తం చేశారని సమాచారం.

ఓటు జాబితాలో భారీ అవకతవకలు : టిడిపి

పల్నాడు జిల్లాలో ఓటర్ల జాబితా తయారీలో భారీ అవకతవకలున్నాయని కలెక్టర్‌కు టిడిపి నాయకులు ఫిర్యాదు చేశారు. టిడిపి జిల్లా అధ్యక్షులు జివి ఆంజనేయులు, మాచర్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి, నరసరావుపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు పలు అంశాలను కలెక్టర్ దృష్టికి తెచ్చారు. అనంతరం విలేకర్లతో జివి ఆంజనేయులు మాట్లాడుతూ బిఎల్ఒలపై వైసిపి నేతలు ఒత్తిడి చేసి టిడిపి సానుభూతిపరుల ఓట్లను అక్రమంగా తొలగిస్తున్నారని అన్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. శావల్యాపురం మండలం మతుకుమల్లిలో 40 మంది ఓట్లు తొలగించారని, దీనిపై పూర్తి ఆధారాలతో ఫిర్యాదు చేశామని అన్నారు. వైసిపి నేతలు భారీ ఎత్తున ఓట్ల అవకతవకలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. వైసిపి నేతలు ఫిర్యాదు ఇవ్వగానే విచారణేమీ లేకుండా వెంటనే ఓట్లను తొలగిస్తున్న అధికారులు తమ ఫిర్యాదులను ఎందుకు పట్టించుకోరని ప్రశ్నించారు. వెల్లటూరులో వైసిపి నేతలు 160 దొంగ ఓట్లను చేర్చారన్నారు. తప్పులు చేసిన అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నూతన జాబితాలో అన్యాయం జరిగితే న్యాయ పోరాటం చేస్తామన్నారు. జూలకంటి బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ ఓటర్ల జాబితా విషయంలో అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. ఓట్ల నమోదు, మార్పులు, చేర్పుల విషయంలో అధికారులు న్యాయంగా వ్యవహరించడం లేదని ఆరోపించారు. డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ఆరు నెలలుగా దొంగ ఓట్లపై ఆధారాలు చూపుతున్నా అధికారులు స్పందించడం లేదని, వైసిపి ఎమ్మెల్యేల కనుసన్నల్లోనే ఓటర్ జాబితా తయారవుతోందని అన్నారు. నిన్న ఉన్న ఓటు ఈ రోజు ఉంటుందో లేదో అర్థం కావడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎల్.వెంకట్రావు, ఎం.సుబ్బారావు, జి.జనార్ధన్‌బాబు, బి.విశ్వేశ్వరరావు, పి.వెంకట కోటయ్య, జి.శేఖర్, కె.కోటిరెడ్డి, కె.శివారెడ్డి, సిహెచ్.గంగయ్య పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో అవకతవకలపై విలేకర్లతో మాట్లాడుతున్న జీవీ ఆంజనేయులు

రాజకీయ పార్టీలు లేవనెత్తిన అంశాలను పరిష్కరించాలి : కలెక్టర్

ఓటర్ల జాబితా ప్రత్యేక సారాంశ సవరణ-2024పై ఇఆర్వోలు, ఎఇఆర్వోలతో ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ సమీక్షించారు. రాజకీయ పార్టీలు లేవనెత్తిన అంశాలపై కులంకుషంగా పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని చెప్పారు. ఎక్కువ సంఖ్యలో దరఖాస్తు చేసిన వారిపై పోలీసులతో సమగ్ర విచారణ జరిపిన అనంతరం అవసరమైతే వారి మీద సెక్షన్ 31 కింద కేసులు నమోదు చేసేలా చూడాలన్నారు. శాశ్వత వలసలు, తాత్కాలిక వలసలు, డబుల్ ఎంట్రీలపై అవసరమైన వారికి నోటీసులిచ్చి తగనగుణంగా చర్యలు తీసుకోవాలన్నారు. చనిపోయిన వారి ఓట్లు తొలగింపు విషయంలో క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారిపై ప్రాస్పెక్టివ్ ఓటర్ నమోదు ప్రక్రియను గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలకు సంబంధించిన విధులను జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు.

నైపుణ్యాలుంటే అవకాశాలకు కొదవలేదు

ఫ్రెషర్స్‌డేలో తిరుమల ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వైవి నారాయణ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

విద్యార్థులలో నైపుణ్యం ఉంటే అనేక రంగాల్లో ఉపాధి అవకాశాలు దక్కుతాయని తిరుమల ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వైవి నారాయణ అన్నారు. అద్భుతమైన పని తీరుంటే ఎంతటి పోటీనైనా తట్టుకుని రాణించేందుకు వీలుందని, అ అవకాశాలను ఇప్పటి ప్రపంచం కల్పిస్తోందని చెప్పారు. నరసరావుపేట మండలంలోని జొన్నలగడ్డ గ్రామ పరిధిలోగల తిరుమల ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రిన్సిపాల్ డాక్టర్ వైవి నారాయణ మాట్లాడుతూ నూతనంగా కళాశాలలో చేరే విద్యార్థులకు ఉన్నత చదువులు, కొత్త ప్రదేశాలు, కొత్త వ్యక్తులు పట్ల సహజంగా ఉన్న భయాందోళన పోగొట్టి విద్యార్థులకు స్వేచ్ఛాయుత వాతావరణాన్ని ఇనుమడింప చేసేందుకు ఫ్రెషర్స్ డే వేడుకలు దోహదం చేస్తాయని అన్నారు. మారుతున్న సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటూ ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకొని జీవితంలో స్థిరపడాలన్నారు. మంచి మార్కులు, ర్యాంకులు సాధించాలంటే బట్టి పట్టడం కాకుండా విషయ పరిజ్ఞానం పెంపొందించుకోవాలని సూచించారు. నేటి యువత అవగాహన లోపంతో క్షణికావేశంతో చిన్నచిన్న తప్పులు చేసి నేరాలకు పాల్పడుతున్నారని, అటువంటి విద్యార్థులు తీరు మార్చుకొని భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని చెప్పారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే విధంగా అవగాహనతో వ్యక్తిత్వాన్ని, అనుభవంతో నడవడికను, చదువు ద్వారా విజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. నేటి పోటీ ప్రపంచానికి తగినట్లుగా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. కళాశాల సెక్రటరీ - కరస్పాండెంట్ రావెల సత్యనారాయణ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థుల శ్రేయస్సు దృష్టిలో పెట్టుకొని వారికవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలనూ సమకూరుస్తున్నామని, ఈ క్రమంలో ఎటువంటి రాజీ లేదని అన్నారు. లాభాపేక్షకు తావు లేకుండా పల్నాడు ప్రాంత రైతు బిడ్డల శ్రేయస్సు కోసం అందుబాటు ఫీజులతో కళాశాలను కొనసాగిస్తున్నామన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ వైవి నారాయణను కళాశాల వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

ప్రిన్సిపాల్ డాక్టర్ వైవి నారాయణను సత్కరిస్తున్న అధ్యాపకులు

నిబంధనలు సడలించి బాధిత రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

కౌలు రైతు కుటుంబాన్ని పరామర్శించిన నాయకులు

ప్రజాశక్తి - దుగ్గిరాల

నిబంధనలు సడలించి గ్రామ పెద్దలతో విచారణ జరిపి బాధిత కుటుంబానికి నష్ట పరిహారం చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మాగంటి హరిబాబు కోరారు. దుగ్గిరాలలో ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు తుళ్లిమిల్లి బసవ పున్నయ్య కుటుంబ సభ్యులను రైతు సంఘం నేతలు పరామర్శించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డు లేకపోవడం వలన వారు చాలా నష్టపోతున్నారన్నారు. భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతుకు గుర్తింపు కార్డు ఇచ్చి వ్యవసాయానికి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రుణాలు ఇవ్వాలని కోరారు . మృతుడు బసవ పున్నయ్య రూ.ఆరు లక్షలు రుణం తీసుకొని కౌలుకు పొలాలు చేస్తుండగా తుపాను కారణంగా పంట నష్టం జరిగడంతో అప్పులు తీర్చే మార్గం లేక ఆందోళనకు గురై ఆత్మహత్య చేసుకున్నాడని అన్నారు. ప్రభుత్వం ఇస్తానన్న రూ. ఏడు లక్షలు ఆ కుటుంబానికి అందించాలని, అతని ఇద్దరు పిల్లలకు గురుకుల పాఠశాలలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బైరగాని శ్రీనివాసరావు, మన్నవ నాగమల్లేశ్వరరావు, సిపిఎం నాయకులు జెట్టి బాలరాజు, వై బ్రహ్మేశ్వరరావు, ఎన్ యోగేశ్వరరావు, ఎం నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరావు ఆ పార్టీ సభ్యులతో కలిసి బాధిత కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. ప్రభుత్వం తక్షణం బసవపున్నయ్య కుటుంబానికి సాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్, నాయకులు చిన్ని తిరుపతయ్య, జాలాది జాన్ బాబు పాల్గొన్నారు.

మృతి చెందిన కౌలు రైతు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎం హరిబాబు, తదితరులు

జొన్నల సుబ్బాయమ్మకు సిపిఎం నేతల నివాళి

ప్రజాశక్తి -పెదకాకాని రూరల్

మండల పరిధిలో నంబూరు గ్రామానికి చెందిన సిపిఎం మండల కమిటీ సభ్యులు జొన్నల అప్పిరెడ్డి తల్లి జొన్నల సుబ్బాయమ్మ (92) శుక్రవారం కన్నుమూశారు. శనివారం ఆమె భౌతికకాయానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి రమాదేవి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై నేతాజీ, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు పి బాలకృష్ణ, సిపిఎం జిల్లా, గ్రామ నాయకులు డి వెంకటరెడ్డి, ఎన్ శివాజీ, ఎం శ్రీనివాసరావు తదితరులు నివాళు లర్పించారు. అప్పిరెడ్డి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నివాళులర్పిస్తున్న సిపిఎం నేత డి రమాదేవి తదితరులు

క్రీడల పేరుతో మరో మోసం

ఉపాధి కల్పన కార్యాలయం ఎదుట తెలుగు యువత నిరసన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

అడుగుదాం ఆంధ్ర పేరుతో యువతను ప్రభుత్వం మోసం చేస్తుందని తెలుగు యువత జిల్లా అధ్యక్షులు రావిపాటి సాయికృష్ణ ఆరోపించారు. గుంటూరులోని ఉపాధి కల్పనా కార్యాలయం ఎదుట శనివారం తెలుగు యువత వినూత్న నిరసన తెలిపింది. వైసిపి ప్రభుత్వం నిరుద్యోగులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయడంలేదన్నారు. మెగా డిఎస్సి ఆచూకి లేదన్నారు. ఈనేపథ్యంలో యువతకు గాలం వేసేందుకు 'ఆడుదాం ఆంధ్ర ఇది అందరి అట' పేరుతో కేవలం ఎన్నికల ప్రచార్భాటం కోసం క్రీడలను ప్రోత్సహిస్తున్నట్టు మోసం చేస్తున్నారని అన్నారు. నాలుగున్నర ఏళ్లలో క్రీడారంగాన్ని యువతను నిర్లక్ష్యం చేసి ఎన్నికలకు మూడునెలల ముందు క్రీడలను ప్రోత్స హిస్తున్నట్టు ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉంద న్నారు. జిల్లాలో ఒక్క స్టేడియం అభివృద్ధి చేయకుండా క్రీడారంగానికి బడ్జెట్ కేటాయించకుండా నిర్లక్ష్యం చేశారన్నారు. రాష్ట్ర తెలుగుయువత ఉపాధ్యక్షులు షేక్ ఫిరోజ్ తెలుగుయువత జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నాగుల్ మీరా బాబు, ఉపాధ్యక్షులు గుత్తికొండ కిరణ్ యాదవ్ , అధికార ప్రతినిధి షేక్ షకూర్,కార్యనిర్వాహక కార్యదర్సులు మన్నెం శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్అదాలత్

ప్రజాశక్తి-గుంటూరు లీగల్

న్యాయసేవాధికార సంస్థ జిల్లా చైర్మన్ వై.వి.ఎస్.బి.జి పార్థసారధి ఆధ్వర్యములో శనివారం గుంటూరు జిల్లాలోని అన్ని కోర్టులలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సంద ర్భంగా జిల్లా కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వైవిఎస్‌బిజి పార్థ సారధి మాట్లాడుతూ కక్షిదారులు లోక్ అదాలత్‌ను వినియోగించుకొని తమ కాలం, ధనం ఆదా చేసుకోవాలని, జాతీయ లోక్ అదాలత్ నిర్వహించే సమయంలో కక్షిదారులు ఏవైనా ఇబ్బందులు ఎదుర్కుంటే తమ దష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో పలువురు న్యాయ వాదులు, కక్షిదారులు, పోలీస్ సిబ్బంది, కోర్ట్ సిబ్బంది పాల్గొన్నారు.జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ న్యాయ సేవాధికార సంస్థల ద్వారా జరిగిన ఈ జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లాలోని వివిధ న్యాయ స్థానాలలో రాజీపడతగ్గ క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, ప్రీ-లిటిగేషన్ కేసులు పరిష్కరించారు. 444 సివిల్ కేసులు, 1490 క్రిమినల్ కేసులు, 89 ప్రేలిటిగేషన్ కేసులు, వెరసి మొత్తం 2023 కేసులు పరిష్కరించారు.జాతీయ లోక్ అదాలత్ నిర్వహణకు సహకరించిన న్యాయాధికారులకు, న్యాయ వాదులకు, పోలీస్ సిబ్బందికి, ప్రభుత్వ సంస్థలకు, కక్షి దారులకు, న్యాయ స్దాన సిబ్బందికి, న్యాయ సేవాధికార సంస్థ, గుంటూరు తరుపున కార్యదర్శి టి.లీలావతి ధన్యవాదములు తెలియచేశారు.

అదాలత్ నిర్వహిస్తున్న న్యాయమూర్తి సృతవిందా



అభివృద్ధిని విస్మరించిన ఎన్‌డిఎ : మస్తాన్‌వలి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

10 ఏళ్ల తరువాత నరేంద్రమోడీకి ఇప్పుడు అభివృద్ధి కార్యక్రమాలు గుర్తుకు వస్తున్నాయని పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలి అన్నారు. శనివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ జన్మదిన వేడుకలను నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లింగం శెట్టి ఈశ్వరరావు, నగర అధ్యక్షులు షేక్ ఉస్మాన్, ఉడా మాజీ ఛైర్మన్ వణుకూరి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు అంబటి రత్తయ్య, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సందీప్, రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం పాల్ విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు. మస్తాన్‌వలి మాట్లాడుతూ 2004 నుంచి 2009 వరకు ప్రజల కోసం ఎన్నో చట్టాలను కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకురాగా వాటిని ఎన్‌డిఎ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. ఉపాధి హామీ పథకం, సమాచార హక్కు చట్టం వంటి వాటిని పూర్తిగా దెబ్బతీస్తున్నారని అన్నారు. దేశంలో అభివృద్ధిని విస్మరించి ప్రజల మధ్య అంతరాలను సృష్టించడమే నరేంద్రమోడీ లక్ష్యంగా పెట్టుకున్నారని అన్నారు. దేశంలో మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా కాంగ్రెస్‌పార్టీ పోరాడుతుందన్నారు. కాంగ్రెస్‌ను బలోపేతం చేసేందుకు సోనియా గాంధీ గత 30 ఏళ్లుగా తీవ్రంగా కృషి చేస్తున్నారని కొనియాడారు.

జనవరి 5 నుండి ప్రపంచ తెలుగు మహాసభలు

ప్రజాశక్తి-గుంటూరు : రాజమండ్రిలోని గైట్ కళాశాల ప్రాంగణంలో జనవరి 5, 6, 7 తేదీల్లో నిర్వహిస్తున్న రెండోవ ప్రపంచ తెలుగు మహాసభల ఆహ్వాన పత్రికను ఆప్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సేవాకుమార్ శనివారం స్థానిక బ్రాడీపేట లోని ఎస్‌హెచ్ఓ సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు తాటికోల పద్మావతి, రావెల సాంబశివరావు, డాక్టర్ రావి రంగారావు, సుభాని, సయ్యద్ జానీభాష, పి.విజయశ్రీ, యం.లలిత కుమారి, పింగళి భాగ్యలక్ష్మి, కె.వెంకట రాజారావు తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వానపత్రాలను ఆవిష్కరిస్తున్న డాక్టర్ సేవాకుమార్, తదితరులు

రెండేళ్ల తర్వాత మంగళగిరి - అమరావతి ఆర్టీసీ బస్ సర్వీస్ పునరుద్ధరణ

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి- అమరావతి ఆర్టీసీ బస్ సర్వీసును పునః ప్రారంభించారు. కోవిడ్ సమయంలో సుమారు రెండు సంవత్సరాలు పైగా నిలిపివేసిన సర్వీస్ ఆర్టీసీ అధికారులు గత వారం నుంచి తిరిగి పునః ప్రారంభించారు. గతంలో మంగళగిరి- అమరావతి రూట్ లో అధికారులు రెండు ఆర్టీసీ సర్వీసులు తిప్పేవారు. మంగళగిరి- అమరావతి మధ్య గంట గంటకి బస్సు ప్రయాణికులకు అందుబాటులో ఉండేది. కోవిడ్ సమయంలో బస్సులను నిలిపివేయటం, ఆ తర్వాత రోడ్డు కూడా సరిగా లేకపోవడంతో సుమారు రెండు సంవత్సరాల నుంచి సర్వీసులు నిలుపుదల చేశారు. అయితే ఇటీవల ప్రయాణికులు మంగళగిరి- అమరావతి బస్ సర్వీసులను పునరుద్ధరించాలని అధికారులకు తరచూ విజ్ఞాపనలు చేస్తున్న నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు మంగళగిరి డిపో నుంచి గత వారం రోజుల నుంచి ఒక సర్వీస్ ను తిప్పుతున్నారు. ఉదయం రెండు ట్రిప్పులు, సాయంత్రం రెండు ట్రిప్పులు తిప్పుతున్నారు. మంగళగిరి నుంచి అమరావతికి ఉదయం 6 గంటలకు, 9: 00 గంటలకు, సాయంత్రం 4: 00 గంటలకు, రాత్రి 7: 20 నిమిషాలకు. అమరావతి నుంచి మంగళగిరికి ఉదయం 7:30 నిమిషములకు, 10: 30 నిమిషాలకు, సాయంత్రం 5:30 నిమిషములకు, రాత్రి 8:30 నిమిషములకు ఆయా బస్ స్టేషన్లలో బస్ సర్వీసు అందుబాటులో ఉంటుందని డిపో మేనేజర్ మంత్రు నాయక్ తెలిపారు. ప్రయాణికుల సంఖ్య పెరిగినచో తిరిగి రెండో బస్ సర్వీసును కూడా ప్రారంభిస్తామన్నారు.

శ్వాసకోశ వ్యాధులపై నేడు ఆరోగ్య సభ

ప్రజాశక్తి-గుంటూరు

అవగాహన సంస్థ క్రమం తప్పకుండా ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న ఆరోగ్య సభలలో భాగంగా నేడు స్థానిక అరండల్‌పేట 15/1, కుబేరా టవర్స్‌లోని అవగాహన కార్యాలయంలో శ్వాసకోశ సంబంధ వ్యాధులు, క్రిటికల్ కేర్, సీజనల్ వ్యాధులపై ఆరోగ్య సభ నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభలో గుంటూరు గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ అసిస్టెంట్ ప్రొఫెసర్ పల్మనాలజిస్ట్ డాక్టర్ వెంకట్ కళ్యాణ్ ప్రధాన వక్తగా పాల్గొని క్రిటికల్ కేర్ ,న్యూమోనియా, ఉబ్బసం, క్షయ, చాతి ఇన్ఫెక్షన్లు, వ్యాధుల గురించి వివరిస్తారన్నారు. ఆసక్తిగల వారందరూ ఈ ఆరోగ్య సభలో పాల్గొనాలని కోరారు.

రేపు హిందూ ఫార్మసీలో తరగతుల ప్రారంభోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో డి. ఫార్మసీ, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, ఫార్మా.డి. మొదటి సంవత్సరం తరగతుల ప్రారంభోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎ.శ్రావణ్‌బాబు ముఖ్య అతిధిగా హాజరు అవుతారని, కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదనరావు తదితరులు పాల్గొంటారన్నారు. ప్రవేశం పొందిన విద్యార్థులు, తల్లి తండ్రులు హాజరై కళాశాలలో యాజమాన్యం ఏర్పాటు చేసిన ప్రయోగశాలలు, గ్రంధాలయం, కంప్యూటర్‌ల్యాబ్, ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్, మెడిసినల్ గార్డెన్, జిమ్, యానిమల్ హౌస్ లాంటి మౌలిక వసతులను గురించి తెలుసుకోవాలని కోరారు.

రేపు ఐటిఐలో అప్రెంటీస్ మేళా

ప్రజాశక్తి -తెనాలి

స్థానిక చినరావూరు ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో ఈనెల 11న అప్రెంటిస్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ రావి చిన్న వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే అప్రెంటిస్ మేళాలో 15 రకాల కంపెనీల ప్రతినిధులు హాజరుకానున్నారని, ఐటీఐ ఏ ట్రేడ్ లో శిక్షణ పొందిన వారైనా అర్హులేనని చెప్పారు. బయోడేటా తో పాటు విద్యార్థులు ఆధార్, పాస్పోర్ట్ సైజ్ ఫోటోతో హాజరు కావాలన్నారు. వివరాలకు 9959828100, 9985614465 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

రైల్వే గేట్ల మూసివేత నిర్ణయాన్ని విరమించుకోవాలి

- ఎంపి శ్రీకృష్ణదేవరాయలును కలిసిన గుడిపూడి, లక్ష్మీపురం రైతులు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

రైల్వే గేట్లు మూసివేత నిర్ణయాన్ని విరమించుకోవాలని ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు రైల్వే అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఎంపిను గుడిపూడి, లక్ష్మీపురం రైతులు శనివారం కలిశారు. రైల్వే లెవెల్ క్రాసింగ్ గేట్ లు 33, 34 మూసి వేయాలన్న రైల్వే అధికారుల నిర్ణయం విషయమై వారు ఎంపీని కలిశారు. దీనిపై స్పందించిన శ్రీకృష్ణదేవరాయలు, గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ రామకృష్ణకు ఫోన్ చేసి మాట్లాడారు. ప్రజలకు మేలు కలిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మార్గాల్లో ఆర్వోబీల నిర్మాణానికి ప్రతిపాదించాలని, డిఆర్ఎంను కోరారు. గుంటూరు - నడికుడి రైలు మార్గంలోని గుడిపూడి వద్ద ఉన్న రైల్వే గేట్ లు ఎల్ సి 33,34 ల వద్ద గేట్ లు నిలుపుదల చేస్తున్నామన్న అధికారుల నిరణ్ణయాల మేరకు.. రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకునేలా సంప్రదింపులు చేయాలని, గుడిపూడి, లక్ష్మీపురం గ్రామాలకు చెందిన 30 మంది రైతులు, ప్రజలు ఎంపీను గుంటూరులో కలిశారు.

ప్రధానమైన ఈ మార్గాల ద్వారా సత్తెనపల్లి నుండి క్రోసూరు మండలంలోని కొన్ని గ్రామాలు, అబ్బూరుతో పాటు సత్తెనపల్లి మండలంలోని చాలా గ్రామాలకు రాకపోకలు జరుగుతాయని వివరించారు. ఎంపి విజ్ఞప్తి మేరకు డిఆర్ఎం సానుకూలంగా స్పందించారు. రైల్వే లెవెల్ క్రాసింగ్ గేట్ల స్థానంలో అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

శ్రీకృష్ణదేవరాయలుతో మాట్లాడుతున్న రైతులు

అగ్రిగోల్డ్ బాధితుల ఒక్కరోజు సత్యాగ్రహ దీక్ష

ప్రజాశక్తి-అమరావతి

అగ్రిగోల్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెదకూరపాడు నియోజకవర్గ పరిధిలో అమరావతి అంబేద్కర్ విగ్రహం దగ్గర అగ్రిగోల్డ్ డిపాజిట్ దారులు చేసిన దీక్షకు రాష్ట్ర సిపిఐ సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ మోసపూరితమైన ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేయకపోవడమంటే అగ్రి గోల్డ్ బాధితులను నమ్మించి మోసం చేయడమేనని విమర్శించారు. సిపిఎం మం డల కార్యదర్శి బి.సూరి బాబు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్రిగోల్డ్ డిపాజిట్ దారులకు బకాయిలను చెల్లిస్తామని హామీ ఇచ్చి, నాలుగున్నరేళ్లు కావస్తున్నా ఎటువంటి చెల్లింపులకు ముందుకు రాలేదని, ప్రభుత్వం వెంటనే బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. టిడిపి నాయకులు కన్యదార వసంతరావు, కాంగ్రెస్ నాయకులు గంటా గోపి, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, మహిళలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-చిలకలూరిపేట

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తానని చెప్పి గద్దెనెక్కిన జగన్‌మోహన్‌రెడ్డి, ముఖ్యమంత్రి అయిన తర్వాత వారి సమ స్యలను పూర్తిగా విస్మరించారని పల్నాడు జిల్లా సిపిఐ కార్యదర్శి ఎ.మారుతీవరప్రసాద్ విమర్శించారు. శనివారం పట్టణంలోని సిపిఐ కార్యాలయం ఎదుట అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒకరోజు సత్యాగ్రహదీక్షను ఆయన ప్రారంభించారు. కార్యక్రమానికి అసో సియేషన్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కె.మంత్రునాయక్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మారుతీ వరప్రసాద్ మాట్లాడుతూ మూడున్నర లక్షల మంది బాధితులకు కేవలం రూ. 96 కోట్లు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకొన్నారని విమ ర్శించారు అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం జరగక పోతే సమర శంఖం పూరిస్తామని, ఇందుకు సంబంధించిన కార్యాచరణ సిద్ధం చేసినట్లు చెప్పారు. సిపిఎం పట్టణ కార్యదర్శి పేరుబోయిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితుల్లో గతంలో రూ.5 లక్షలు ఇచ్చిన వారికి మరో రూ.5 లక్షలు ఇవ్వా లని, గతంలో లబ్ది పొందని వారికి రూ.10 లక్షల చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, సిపిఐ ఏరియా కార్యదర్శి నాగబైరు రామసుబ్బాయమ్మ, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం రాధాకృష్ణ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఇనగంటి జగదీష్, రాష్ట్ర మహిళా కార్యదర్శి షేక్ జరినా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

అమరావతిలో మాట్లాడుతున్న ముప్పాళ్ళ నాగేశ్వరరావు

‘టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి, యువతకు ఉపాధి’

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాష్ట్రాభివృద్ధి, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు టిడిపి ద్వారా సాధ్యమని రానున్న ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రావడం ఖాయమని టిడిపి నరసరావుపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. నరసరావుపేట పట్టణంలోని 28,29 వార్డులో స్థానిక పాండురంగ, కుసుమ హరినాథ్ స్వామి దేవాలయ ప్రాంతంలో శనివారం ‘బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ” కార్యక్రమంలో బాగంగా డాక్టర్ చదలవాడ పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్ళి ప్రభుత్వ అవినీతిని ఎండగట్టారు. డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ ప్రభుత్వ పెద్దలు, ప్రజా ప్రతినిధులు ప్రజా సమస్యలను పక్కన పెట్టి కుల,మత,వర్గ,ప్రాంతీయ భేదాలు రెచ్చగొడుతున్నారన్నారు. కొత్త పెట్టుబడులు తీసుకురాకపోగా ఉన్న పరిశ్రమలు వెళ్ళగొడుతున్నారని విమర్శించారు. ప్రశ్నార్థకంగా మారిన రాష్ట్ర భవిష్యత్తును గాడిన పెట్టాలంటే చంద్రబాబు నాయుడు ద్వారానే సాధ్యమన్నారు. ప్రతి ఇంటికి వెళ్ళి కరపత్రాలు అందిస్తు వైసిపి నాలుగున్నరేళ్ల కాలంలో , ఆరాచకాల, దాడులను వివరించారు.

నరసరావుపేటలో ప్రచారం చేస్తున్న చదలవాడ అరవిందబాబు

అమరావతిలో లక్ష దీపోత్సవం

ప్రజాశక్తి-అమరావతి

అమరావతి పెద్దింటమ్మ తల్లి సన్నిధిలో శనివారం లక్షదీపోత్సవ పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సందర్శకులు కార్తీకదీపాలు వెలిగించారు. అనంతరం ఆలయ కమిటీవారు సందర్శకులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ పునరనిర్మాణ కర్త నిమ్మా విజయ సాగర్‌బాబు, చైర్మన్ ఆకుల వాసు పాల్గొన్నారు.

కేక్ ను కట్ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నేతలు

ఘనంగా సోనియా గాంధీ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్

కాంగ్రెస్ పార్టీ అధినేత సోనియా గాంధీ 78వ పుట్టినరోజు వేడుకలు స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు జ్ఞానరాజ్‌పాల్ మాట్లాడారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేసి కార్యకర్తలకు అందించారు. కార్యక్రమంలో నాయకులు చాంద్‌బాషా, టి.రామకృష్ణ, లక్ష్మయ్య, మొహమ్మద్ ఆరీఫ్, జి.ఖన్నా, కోట ఆనంద్, జిల్లెల్ల పాలరాజ్, మాలే పద్మారావు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలలో పండ్లు పంపిణీ

ప్రజాశక్తి-అమరావతి

ఎఐసిసి మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ పుట్టిన రోజు సందర్భంగా స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాలలో పల్నాడు జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గంటా గోపి రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్యాగానికి మారుపేరు సోనియాగాంధీ అని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉదయ శంకర్,బాజీ, తిరుపతిరావు పాల్గొన్నారు.

కార్తీక వనసమారాధనలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి-రొంపిచర్ల

స్థానిక బాలత్రిపుర సుందరీసమేత శంకరస్వామి దేవస్థాన ఆవరణలో శనివారం కార్తీక వనసమారాధన కార్యక్రమం జరిగింది. వనసమారాధనకు హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డికి వైసిపి నాయకులు, ఆలయకమిటీ సభ్యులు, గ్రామస్థులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు ఎమ్మెల్యే మాట్లా డుతూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించుకోవడంతో గ్రామస్తులలో ఐక్యత, స్నేహ భావం కలుగుతాయని అన్నారు. అనంతరం ఆలయ ఆవరణలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. సుమారు నాలుగువేల మందికి పైగా అన్నదానం చేశారు. వనసమారాధనలో వైసిపి యువజన విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షుడు పి.శివారెడ్డి, మాజీ సర్పంచ్ జి.కోటిరెడ్డి, జి.కోటిరెడ్డి, విఆర్ఒ పి.సుబ్బారెడ్డి, వైసిపి మండల కన్వీనర్ కె.శ్రీనివాసరెడ్డి, వైసిపి మండల నాయకులు పి.రవీంద్రబాబు, పి.కోటిరెడ్డి, పి.రమణారెడ్డి,పి.హనిమిరెడ్డి పాల్గొన్నారు.

ఎస్‌టియు నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-సత్తెనపల్లి

సత్తెనపల్లి మండల శాఖ ఎస్‌టియు నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవమైంది. స్థానిక బాలికోన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమానికి సత్తెనపల్లి ప్రాంతీయ కార్యదర్శి షేక్ మహబూబ్ సుభాని (సుబ్బు) అధ్యక్షత వహించారు. గౌరవాధ్య క్షులుగా జి.సాల్మన్‌రాజు, మండల శాఖ అధ్యక్షునిగా ఎస్ఎం రెహమాన్, మండల శాఖ ప్రధాన కార్యదర్శిగా మోదుగుల అప్పా రావు, ఆర్థిక కార్యదర్శిగా పి.వెంకయ్య, మహిళా కార్యదర్శిగా కె.భాగ్య లక్ష్మి, జిల్లా కౌన్సిలర్లుగా కె.సురేష్, ఎస్ ఎమ్ సుభాని, షేక్ మహబూబ్ సుభాని(సుబ్బు), టి.రాజు, పి.నాగవేణు, వి. నాగరాజు, బి వెంకటేశ్వరరావు, బి.నర సింహారావు లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఎపిటిఎఫ్ మండల నూతన శాఖ ఎన్నిక

ప్రజాశక్తి-రాజుపాలెం

రాజుపాలెం మండల ఎపిటిఎఫ్ మండల నూతన శాఖను శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా అద్దంకి శ్రీధర్ ఎంపిపిఎస్, ఆర్ఆర్ సెంటర్, చౌట పాపయ్య పాలెం, ప్రధాన కార్యదర్శిగా కొడవటి రవికుమార్ ఎంపిపిఎస్, ఆర్ఆర్ సెంటర్, రాజుపాలెం నియమితులయ్యారు. కార్య దర్శులుగా జి.నాగేశ్వరరావు,రమేష్,నాగర్ షరీఫ్,సీతారవమ్మా, జిల్లా కౌన్సిలర్లు బాళ్ళా శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, రాంబాబు, తులసి రమణలను ఎన్నుకున్నారు.

సాహిత్య కళా ఉత్సవాలకు పాపారావుకు ఆహ్వానం

ప్రజాశక్తి-రొంపిచర్ల

మండలంలో ముత్తనపల్లి కి చెందిన కవి, రచయిత గార్ల పాటి పాపారావుకు ప్రపంచ తెలుగు సాహిత్య కళా ఉత్సవాలకు ఆహ్వానం వచ్చింది. ఈ మేరకు శనివారం ఒక ప్రకటనలో కవి, రచయిత పాపారావు తెలిపారు. అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 16,17 తేదీలలో పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం లో జరిగే ప్రపంచ స్థాయి కవితా గానం కార్యక్రమానికి తను ఆహ్వానం అందినట్లు తెలిపారు.

అధ్వాన్నంగా కాజ - నంబూరు రోడ్డు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

నగర పరిధి లోని కాజ-నంబూరు రహదారి గుంటలు పడి రాకపోకలు సాగించాలంటే నరకం కనిపిస్తోందని వాహన చోదకులు ఆవేదన చెందుతున్నారు. గడిచిన రెండేళ్లుగా పాడైన ఈ రోడ్డు మార్గంలోనే రాకపోకలు సాగిస్తున్నప్పటికి ఇటీవల కురిసిన వర్షాలకు బాగా పాడవడంతో రాకపోకల వేళల్లో పడరాని పాట్లు పడుతున్నామని రైతులు, విద్యా సంస్థలకు వెళ్లేవారూ వాపోతున్నారు. కాజలో బాగానే వున్న సిమెంటు రోడ్డును తారు రోడ్డుగా మార్చారు. కాని నంబూరు వైపు వెళ్లే రోడ్డు కనీసం మరమ్మతులు చేయాలనే ఆలోచన అధికారులకు, నాయకులకూ రాకపోవడం విచారకరమని స్థానికులు విమర్శిస్తున్నారు. అధికారులు, నాయకులు స్పందించి నంబూరు రోడ్డుకు మోక్షం కల్పించాలని కోరుతున్నారు.

ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని కీర్తి ఎస్టేట్స్ సమీపంలో ఉన్న సురక్ష అకాడమీలో ధన్వంతరి జయంతి సందర్భంగా శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుర్వేద మందులు ఉచితంగా అందజేశారు. వివిధ రకాల పరీక్షలు నిర్వహించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం స్పెషలిస్టు ఆయుర్వేద వైద్య నిపుణులను కలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ పూర్ణరాజేశ్వరి పాల్గొన్నారు.

నేడు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కృత్రిమ చేతులు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు కృత్రిమ చేతులు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ ప్రతినిధులు తెలిపారు. మంగళగరిలోని గౌతమ బుద్ధ రోడ్డులోని రాయల్ కన్వెన్షన్‌లో నిర్వహించే కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ బూసిరెడ్డి శంకర్‌రెడ్డి పలువురు అధికారులు పాల్గొంటారని తెలిపారు.

పెళ్లి కానుక అందజేస్తున్న టిడిపి కార్యకర్తలు

ఆలపాటి పెళ్లి కానుక అందజేత

ప్రజాశక్తి - తెనాలి రూరల్ : గతంలో ఏ రాజకీయ నేత చేయని విధంగా మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పెళ్లికానుక ఆందిస్తున్నారు. నియోజకవర్గ పరిధిలో వివాహం జరుపుకుంటున్న నూతన వధూవరులకు తమ అభీష్టం మేరకు ఉంగరం లేక తాలిబొట్టు బహుకరిస్తున్నారు. తెనాలి మండలం పెదరావూరు గ్రామానికి చెందిన కోలనీడి సురేష్, నీరజ దంపతుల కుమార్తె ప్రత్యూష వివాహం సందర్భంగా ఆమెకు ఆలపాటి రాజేంద్రప్రసాద్ తరపున ఉంగరం బహూకరించారు. స్థానిక పార్టీ నేతలు వధువుకు చీర, సారె అందించారు.

దెబ్బతిన్న పంట పొలాలు పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పెదకాకాని రూరల్

పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తక్షణం పరిహారం అందించాలని పొన్నూరు మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ డిమాండ్ చేశారు. శనివారం పెదకాకాని మండలంలో వెంకటకృష్ణాపురం, ఉప్పలపాడు, పెదకాకాని, వెనిగండ్ల గ్రామాల్లో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ధూళిపాళ్ల నరేంద్ర మాట్లాడుతు ప్రభుత్వ అలసత్వం కారణంగానే రైతు పంట నష్టపోయాడని అన్నారు. రైతు పండించిన ప్రతి గింజను నేరుగా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ అధికారులు సలహాలతో మిగిలిన పంటను సంరక్షించుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 248 కేసులు పరిష్కారం

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి కోర్టు పరిధిలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలతో దాదాపు 248 కేసులో పరిష్కారం జరిగాయి. సుమారు రూ.3 కోట్ల 32 లక్షల 60 వేల నగదు చెల్లింపులు కక్షిదారుల ఇరువర్గాల నుండి రికార్డు స్థాయిలో జరిగాయి. సీనియర్ సివిల్ జడ్జి కోర్టు నుండి 16 కేసులు పరిష్కారం కాగా 1 కోటి 71 లక్షల 26 వేలు, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నుండి 12 కేసులు పరిష్కారం కాగా రూ. 10 లక్షల 41 వేల 500 నగదు చెల్లింపులు కక్షిదారుల నుండి జరిగాయి. అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టులో మొత్తం 220 కేసులు 1 కోటి 50 లక్షల 92 వేల 500 నగదు చెల్లింపులు జరిగాయి. సీనియర్ సివిల్ జడ్జి ఎం ఎల్ ఎస్ ఏ చైర్మన్ వై నాగరాజు మాట్లాడుతూ లోక్ అదాలత్ సౌలభ్యాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకొని లబ్ధి పొందాలన్నారు. సత్వర న్యాయం లోక్ అదాలత్ లక్ష్యం అన్నారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్ వి రామకృష్ణ మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా రాజీ పడితే ఇరు వర్గాలు విజయం సాధించినట్లేనని, లోక్ అదాలత్ పై అప్పీలు ఉండదని చెప్పారు. ఎస్ బి ఐ మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ రుణగ్రహీతలు లోక్ అదాలత్ ద్వారా వన్ టైం సెటిల్మెంట్ అవకాశం పొందితే మరలా లోన్ తీసుకునే అవకాశం ఉందని, ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ వి ప్రత్యూష, లోక్ అదాలత్ బెంచ్ సభ్యులు దొడ్డక బ్రహ్మానందం, వేమూరి రత్న ప్రసాద్, జొన్నాదుల లెనిన్ బాబు, బ్యాంక్ న్యాయవాదులు వాక రామ్ గోపాల్ గౌడ్, లంక శివరాం ప్రసాద్, పలు బ్యాంక్ అధికారులు, బార్ అసోసియేషన్ న్యాయవాదులు, ఎం ఎల్ ఎస్ ఏ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి వైసిపితోనే సాధ్యం : ఎంపిపి

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

పొన్నూరు మండలం దండమూడి గ్రామంలో గ్రామ సచివాలయంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా సంక్షేమ పథకాల ప్రదర్శన బోర్డును ఎంపీపీ భవనం పద్మలీల ఆవిష్కరించారు. ఎండిఒ శ్రీనివాస్ అధ్యక్షతన కార్యక్రమంలో ఎంపిపి పద్మలీల మాట్లాడుతూ గ్రామానికి రూ. 4. 64 కోట్లు వివిధ సంక్షేమ పథకాలు ద్వారా ప్రజలకు అందించిన ఘనత సీఎంకు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో రుద్రపాటి ఆదిశేషులు, షేక్. సర్దార్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి విశాలాంధ్ర పుస్తక ప్రదర్శన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

విశాలాంధ్ర బుక్ హౌస్ ఆధ్వర్యంలో గుంటూరు ఎ.ఎల్.బిఈడి కళాశాల ఆవరణలో ఈ నెల 10వ తేదీ నుంచి 31వ తేది వరకు 23వ పుస్తక మహోత్సవం (పుస్తక ప్రదర్శన) ఏర్పాటు చేసినట్లు అభ్యుదయ రచయితల సంఘం (అరసం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్, విశాలాంధ్ర బుక్ హౌస్ గుంటూరు బ్రాంచ్ మేనేజర్ మురకొండ మల్లిఖార్జునరావు తెలిపారు. స్థానిక విశాలాంధ్ర బుక్ హౌస్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు పుస్తక ప్రదర్శనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ పుస్తక మహోత్సవాన్ని ఆదివారం సాయంత్రం 5 గంటలకు నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రారంభిస్తారన్నారు. అనంతరం విశాలాంధ్ర విజ్ఞాన సమితి అధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగే ప్రారంభోత్సవ సభకు విశాలాంధ్ర విజ్ఞాన సమితి జనరల్ మేనేజర్ పుట్టా హరనాథరెడ్డి, డిప్యూటీ జనరల్ మేనేజర్ టి. మనోహర్ నాయుడు, సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, అరసం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణలతో పాటు పలువురు ప్రముఖ రచయితలు హాజరుకానున్నట్లు వివరించారు. పుస్తక మహోత్సవంలో 40 రకాల ప్రచురణ సంస్థలు ప్రచురించిన 20 వేల పుస్తకాలు పాఠకులకు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

వార్డుల్లో డిప్యూటీ కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి శనివారం ఉదయం పర్యటించారు. నాంచారమ్మ చెరువు, శ్రీనివాస్ మహల్ ప్రాంతాల్లో పారిశుధ్యాన్ని పర్యవేక్షించారు. చెత్త, మురుగు పూడికలు ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. తడి చెత్త పొడి చెత్త వేర్వేరుగా సేకరించి సిబ్బందికి అందించాలని ప్రజలకు సూచించారు.

విశ్రాంత డ్రిల్ మాస్టర్ పురుషోత్తం కన్నుమూత

ప్రజాశక్తి - మంగళగిరి



మంగళగిరి సి.కె.పాఠశాల విశ్రాంత డ్రిల్ మాస్టర్ పురుషోత్తం (90) శుక్రవారం రాత్రి అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి కన్నుమూశారు. ఆయన భౌతికకాయానికి పట్నంలోని పలువురు ప్రముఖులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాష్టరు కుటుంబ సభ్యులకు సికె హైస్కూల్‌లో పదవ తరగతి అభ్యసించిన (1994-95)బ్యాచ్, రాయల్ కన్వెన్షన్ అధినేత నన్నపనేని నాగేశ్వరావు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సిపిఐ ఎంఎల్ నాయకులు రేఖ రమేష్‌బాబు కన్నుమూత

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి పట్నానికి చెందిన సిపిఐ ఎంఎల్ నాయకులు రేఖ రమేష్ బాబు 72 సంవత్సరాలు శనివారం మతి చెందారు. రమేష్ బాబు భౌతికయంపై సిపిఐ ఎంఎల్ జిల్లా నాయకులు కే కోటయ్య, ఎం అంజిరెడ్డి, యు నాగేశ్వరావు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రమేష్ బాబు ఈ ప్రాంతంలో అనేక ప్రజా ఉద్యమాలు నిర్వహించారని అన్నారు. అంత్యక్రియలు ఆదివారం జరుగుతాయని తెలిపారు.

వైసిపి నాయకులు గోళ్ల శ్యాంకు మాతృ వియోగం

ప్రజాశక్తి - పెదకాకాని రూరల్

వైసిపి నాయకులు గోళ్ల శ్యాం తల్లి అన్నపూర్ణమ్మ (91) శనివారం కన్నుమూశారు. మండలంలోని లూథరగిరి కాలనీలో ఆమె భౌతికకాయానికి వైసిపి ఎమ్మెల్యే కిలారి రోశయ్య, ఆళ్ల రామకృష్ణారెడ్డి, వైసిపి నేత డొక్కా మాణిక్యవరప్రసాద్ తదితరులు ఘన నివాళులర్పించారు. ఆమె కుటుంబానికి సానుభూతి తెలియజేశారు.

భజన బృందాలకు సత్కారం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో కార్తీకమాసం పురస్కరించుకొని స్థానిక శివ భక్త భజన బృందం ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం 24వ శివనామ అర్థ ఏకాహం శనివారం ఉదయం 6 గంటలకు ముగిసింది. ఈ సందర్భంగా దేవస్థానంలో నాలుగు భజన బృందాల ప్రతినిధులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ మన్నెం రమేష్ బాబు, శ్రీమతి అనిత దంపతులు, దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యులు కొల్లి వెంకట బాబురావు, అద్దంకి వెంకటేశ్వర్లు, విశ్వహిందూ పరిషత్ అధ్యక్షులు వడ్లమూడి వెంకయ్య చౌదరి, మాజీ ట్రస్ట్ బోర్డ్ సభ్యులు అన్నపరెడ్డి రామకృష్ణారెడ్డి, పణిదపు వీర రాఘవయ్య, నాగమయ్య, మాదాను శివమ్మ, దామర్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వివిఐటి అధ్యాపకులు లక్ష్మారెడ్డికి డాక్టరేట్

ప్రజాశక్తి-తెనాలి

వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల నంబూరు సైన్స్ అండ్ హ్యుమానిటీస్ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ కొండా లక్ష్మారెడ్డి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకున్నారు. కామర్స్ అండ్ బిజినెస్ అడ్మిని స్ట్రేషన్‌కు సంబంధించి 'మ్యూచువల్ ఫండ్ సెలక్షన్ బిహేవియర్ ఆఫ్ ఇండివిడ్యువల్ ఇన్వెస్టర్స్ త్రు ద మీడియేటింగ్ రోల్ ఆఫ్ ఫర్ సి వుడ్ రిస్క్' అంశంపై డాక్టర్ కడప లలిత పర్యవేక్షణలో సమర్పించిన పరిశోధన పత్రాలకు గాను డాక్టరేట్ లభించినట్లు లక్ష్మారెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయనను కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, ప్రిన్సిపల్ డాక్టర్ వై మల్లికార్జున రెడ్డి, డీన్ ఆఫ్ అకాడమిక్ డాక్టర్ కె గిరిబాబు, డీన్ ఆఫ్ ఫ్రెష్ మెన్ డాక్టర్ ఎం వి రఘురాం అభినందించారు.

లక్ష్మారెడ్డి ని అభినందిస్తున్న చైర్మన్ విద్యాసాగర్

ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఇరు సంస్థల ప్రతినిధులు

స్మార్ట్‌బ్రిడ్జి ఎడ్యుటెక్‌తో కళ్లం కాలేజి ఒప్పందం

ప్రజాశక్తి-గుంటూరు

కళ్లం హరనాధరెడ్డి ఇంజినీరింగ్ కాలేజి, ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ స్మార్ట్ బ్రిడ్జి ఎడ్యుటెక్ కంపెనీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ మొవ్వ ఉమాశంకర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఇరువురు సంస్థల ప్రతినిధులు కళాశాలలో ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ఈ ఒప్పందంలో భాగంగా స్మార్ట్ బ్రిడ్జి ఎడ్యుటెక్ కంపెనీ కళ్లం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లతోపాటు, మల్టీ నేషనల్ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని కంపెనీ ప్రతినిధి జయప్రకాష్ తెలిపారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బిఎస్‌బి రెడ్డి, కళాశాల ఉపాధి కల్పన అధికారి డాక్టర్ పి.ఎల్.మాధవరావు, ఇంజినీరింగ్ విభాగాధిపతులు పాల్గొన్నారు.

టిడిపిలో పెరుగుతున్న గందరగోళం

వీక్షణం

గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని టిడిపి నేతల్లో గందరగోళ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో నియోజకవర్గాల్లో బహు నాయకత్వం పెరుగుతోంది. ఇన్‌ఛార్జీల స్థానంలో కొత్తవారు రంగ ప్రవేశం చేస్తున్నారు. పార్టీ కోసం ఏమాత్రం కష్టపడకుండా కేవలం డబ్బు ప్రాతిపదికన అనేక మంది నేతలు రానున్న ఎన్నికల్లో టిక్కెట్‌లు ఆశిస్తుండటాన్ని సీనియర్లు జీర్ణించుకోలేకపోతున్నారు. ఎన్ఆర్ఐలు, పారిశ్రామిక వేత్తలు, విద్యా, వైద్య రంగాలకు చెందిన పలువురు ఎన్నికల సమయంలో తెరపైకి రావడం, పార్టీకి కొంత విరాళం ఇవ్వడం, టిక్కెట్లు కోరడం, ఓడిపోతే మళ్లీ కనుమరుగు కావడం నష్టదాయకమని సీనియర్ నాయకులు వాపోతున్నారు. వీరంతా సొంతంగా కార్యక్రమాలు చేసుకుంటూ ప్రస్తుతం ఇన్‌ఛార్జిలను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. పార్టీ కార్యక్రమాల కన్నా వ్యక్తిగత కార్యక్రమాలకే వారు ప్రాధాన్యత ఇస్తున్నారు. పార్టీ నిర్వహించే కార్యక్రమాల్లో సమిష్టిగా పాల్గొనడం చాలా అరుదుగా కన్పిస్తోంది. కొంత మంది నాయకులు తామే ఎన్నికల్లో పోటీ చేస్తామని, తమకే టిడిపి టిక్కెట్ అని చెప్పుకుంటూ ప్రజలలోకి రాకుండా సోషల్ మీడియా పోస్టింగ్‌లకు పరిమితం అవుతున్నారు. వైసిపి ప్రభుత్వంపై విమర్శలు, టిడిపి అధినేత చంద్రబాబుపై పొగడ్తలతో సోషల్ మీడియా ప్రచారం తప్ప ప్రజల్లోకి వచ్చి ఒక్క కార్యక్రమం కూడా చేయని వారు తమకే టిక్కెట్లు తాడికొండ, గుంటూరు నగరంలో ఎక్కువగా కన్పిస్తున్నారు. పారిశ్రామికవేత్తలు, ఎన్ఆర్ఐలు తమ సంస్థల్లోపనిచేసే ఉద్యోగులతోనే ప్రచార అర్భాటం చేస్తున్నారు. టిడిపి అధినేత చంద్రబాబు, నారా లోకేష్‌ను కలవడం, పార్టీకి రూ.లక్షల్లో విరాళం ఇవ్వడం, తమకు ఫలానా నియోజకవర్గం నుంచి అవకాశం ఇవ్వమని కోరడం పరిపాటిగా మారింది. వారు కూడా ముందు నియోజకవర్గాల్లో తిరగండి... తరువాత చూద్దాం అని హామీ ఇచ్చేయడంతో ఏళ్ల తరబడి నియోజకవర్గాన్ని అంట పెట్టుకున్న ఇన్‌ఛార్జిలను కాదని వీరు చేస్తున్న హడావుడితో పార్టీలో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఉచిత వైద్య శిబిరాలు, అన్న క్యాంటీన్లు, మొక్కుబడిగా పలుసేవా కార్యక్రమాల పేరుతో సోషల్‌మీడియాలో కన్పించేందుకు మాత్రమే వీరు ప్రాధాన్యత ఇస్తున్నారు. నర్సరావుపేటలో నిత్యం ప్రజల్లో తిరిగే చదలవాడ అరవింద బాబుకు వ్యతిరేకంగా ప్రజలతో సంబంధాలు లేని ఒక సామాజిక వర్గం నాయకులు తమకే టిక్కెట్లు ప్రచారం చేసుకుంటున్నారు. గుంటూరు జిల్లా అధ్యక్షులు, తాడికొండ నియోజకవర్గ ఇంఛార్జిగా ఉన్న శ్రావణ్‌కుమార్‌కు వ్యతి రేకంగా 2019లో మాదిరిగానే ఇప్పుడు కూడా అసమ్మతి కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. టిడిపి, జనసేన పొత్తులో తెనాలి నుంచి సీనియర్ నాయకుడు నాదెండ్ల మనోహర్ పోటీ చేస్తారని పవన్ కల్యాణ్ ప్రకటించారు. అయితే ఇక్కడ ప్రాతినిధ్యం వహించిన మాజీమంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు ఇంత వరకు ప్రత్యామ్నాయం చూపకపోవడంతో తెనాలిలో గందరగోళం నెలకొంది. సత్తెనపల్లి ఇన్‌ఛార్జి కన్నా లక్ష్మీనారాయణకు వ్యతిరేకంగా కోడెల శివరామ్ నిత్యం ఎదో కార్యక్రమం చేస్తూ ప్రజల్లోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. గుంటూరు పశ్చిమలో ప్రజలతో సంబంధాలులేనివారు దాదాపు 10 మంది వరకు తమకే టిక్కెట్టు ప్రచారం చేసుకుంటున్నారు. తూర్పు నియోజక వర్గంలో నశీర్ అహ్మద్‌కు వ్యతిరేకంగా అసమ్మతి కార్యకలాపాలు ఊపందుకున్నాయి. గుంటూరు తూర్పును ముస్లింయేతర వర్గాలకు ఇవ్వాలని కొత్త డిమాండ్‌ను తెరపైకి తెస్తున్నారు.

(ఎ.వి.డి.శర్మ)

రహదారులకు మోక్షం

- ఉమ్మడి జిల్లాలో 155 కిలో మీటర్లకు అనుమతులు
- ఎన్నికల నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా ప్రభుత్వం

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో పలు రహదారుల నిర్మాణాలకు ఎట్టకేలకు అనుమతులు మంజూరు అయ్యాయి. దాదాపు రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రతి పాదనలకు ఇటీవల మోక్షం లభించింది. పిఎంజిఎస్‌వై స్కీమ్, హైం ఇంపాక్ట్ రోడ్లు కలిపి సుమారు 155 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణానికి అనుమతులు వచ్చాయి. దీంతో జిల్లాలో ఆయా రహదారుల నిర్మాణాలు చేపట్టటానికి సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం టెండర్ దశలో ఉన్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రోడ్ల నిర్మాణం వేగవంతంగా పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తుంది. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా 60:40 శాతం వాటాతో ప్రధాన మంత్రి గ్రామ్ సడక్ యోజన స్కీమ్(పిఎంజిఎస్‌వై) కింద పలు రోడ్లు మంజూరు అయ్యాయి. దాదాపు రెండేళ్ల క్రితం నాటి ప్రతిపాదనలకు ఇప్పుడు అనుమతులు వచ్చాయి. పిఎంజిఎస్‌వై కింద ఉమ్మడి గుంటూరు జిల్లాలో మొత్తం 95.18 కిలో మీటర్లు రోడ్లు నిర్మాణానికి కేంద్రం రూ.45.97 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.31.31 కోట్లు, మొత్తం రూ.76.22 కోట్లు ఖర్చు చేస్తుంది. ఇవి కాక నిర్మాణ అనంతరం ఆయా రోడ్ల నిర్వహణకు రూ.5.45 కోట్లు మంజూరు అయ్యాయి. అలాగే రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతగా భావిస్తున్న హై ఇంపాక్ట్ రోడ్లకు అనుమతులు వచ్చాయి. వీటి ప్రతిపాదనలు సుమారు సంవత్సర కాలంగా పెండింగ్‌లో ఉండి ఇటీవల గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. వీటి నిర్మాణానికి అయ్యే ఖర్చును పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుంది. ఫిబ్రవరి, మార్చిలో ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నందున ఇప్పుడు ఈ రోడ్లుకు అనుమతులు ఇచ్చినట్లు తెలుస్తుంది. ప్రస్తుతం ఇవి టెండర్ దశలో ఉన్నాయి. ఎన్నికలకు మరో రెండు, మూడు నెలలే సమయం ఉన్నందున ఈలోగా రోడ్ల పనులు పూర్తి అవుతాయా లేదా అన్నది సందేహం.హైం ఇంపాక్ట్ రోడ్ల కింద రాష్ట్ర ప్రభుత్వం నూతన గుంటూరు, పల్నాడు జిల్లాలో కలిపి 60.46 కిలోమీటర్ల రోడ్లు మంజూరు అయ్యాయి. వీటికిగాను రూ.47.38 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు.

పిఎంజిఎస్‌వై స్కీమ్ కింద మంజూరైన రోడ్లు..

చందోలు ఆర్‌అండ్‌బి రోడ్డు 16.80 కిలోమీటర్ల నుండి పంచల వరం ఆర్‌అండ్‌బి రోడ్డు వరకూ, నేషనల్ హైవే-16లో కమ్మ కళ్యాణమండపం నుండి పెరవలి వరకూ,

దాచేపల్లిలోని ఎస్‌పి అగ్రహారం నుండి చెన్నాయపాలెం వరకూ, దుగ్గిరాలలోని తెనాలి-మంగళగిరి రోడ్డు నుండి ఉప్పలగుంట వరకూ, క్రోసూరులోని తాళ్లూరు నుండి పెదపాలెం వరకూ, రేపల్లె నిజాంపట్నం రోడ్డు 25 కిలోమీటర్ల నుండి చందోలు బ్రిడ్జి వరకూ, రేపల్లె నిజాంపట్నం 16. కిలోమీటర్ల నుండి కోనపాలెం వరకూ, పెదకాకానిలోని నేషనల్ హైవే నుండి కొప్పురావూరు మీదుగా జొన్నలగడ్డ వరకూ, పిడుగురాళ్ల నుండి గుత్తికొండ వరకూ, పిట్టలవానిపాలెం-గణపవరం, గుంటూరు, చీరాల రోడ్డు 25.60 కిలోమీటర్ల నుండి మామిళ్లపల్లి గ్రామం వరకూ, కూచిపూడి సంగం జాగర్లమూడి చిన్నపాలెం వద్ద నుండి సంగం జాగర్లమూడి యడ్లపల్లి వరకూ, లేమల్లెపాడు-పాత కొల్లిమెర్ల, వేమూరు-కూచిపూడి, రోడ్లు మంజూరు అయ్యాయి.

హై ఇంపాక్ట్ రోడ్లు..

గుంటూరు జిల్లాలో కెఆర్ కొండూరు-చిలువూరు, గుంటూరు, చీరాల రోడ్డులోని 25/60 కిలోమీటర్ల నుండి మామిళ్ల పల్లి వరకూ, ఫిరంగిపురం మండలంలోని గుంటూరు, నర్సరావుపేట రోడ్డు నుండి మునగపాడు వరకూ, పెదపరిమి-వైకుంఠపురం, సరిపూడి నుండి విశదలకు అప్రోచ్ బిటి రోడ్డు, గుంటూరు రూరల్ పరిధిలోని తురకపాలెం హిందూ స్మశాన వాటిక నుండి తుఫాన్ నగర్ వరకూ మంజూరు అయ్యాయి. అదే విధంగా పల్నాడు జిల్లా పరిధిలోని పసుమర్రు నుండి నేషనల్ హైవే-16కి బైపాస్ రోడ్డు, వినుకొండ-కారెంపూడి ఆర్ అండ్‌బి రోడ్డు 3/9 కిలోమీటర్ల నుండి వెంకుపాలెం వరకూ, వినుకొండలోని శ్రీనగర్ నుండి నదిగడ్డ వరకూ బిటి రోడ్డు, క్రోసూరు మండలంలోని దొడ్లేరు నుండి గుంటూరు- పిడుగురాళ్ల రోడ్డు, కొమెరపూడి-యర్రగుంట్లపాడు, వినుకొండ- మార్కాపురం ఆర్‌అండ్‌బి రోడ్డు చెక్‌పోస్టు నుండి రైతు నగర్ వరకూ రోడ్లు మంజూరు అయ్యాయి.

హిందూ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక హిందూ కళాశాలలో శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది.300 మందికి పైగా కళాశాల పూర్వ విద్యార్థులు వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసి ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో, పరిచయాలతో, ప్రస్తుత విద్యార్థులతో ఇష్టాగోష్టిలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన పూర్వ విద్యార్థి ఐపిఎస్ అధికారి జి.హరిప్రసాదరాజు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన చదువు ఉన్నత స్థానాలకు చేరుస్తుందన్నారు. ఓఎన్‌జిసి పూర్వ జనరల్ మేనేజర్ దేశరాజు మూర్తి మాట్లాడుతూ తన ఉన్నతికి హిందూ కళాశాల ఎంతో దోహద పడిందని తెలియజేశారు. మరొక పూర్వ విద్యార్థి ఆంధ్ర రంజిట్రోఫీ మాజీ ప్లేయర్ డి.వి సుబ్బారావు హిందూ కళాశాల క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చిందని తెలియ జేశారు. ఈ సందర్భంగా కళాశాల విశ్రాంత అధ్యాపకులు దత్తప్రసాద్, డాక్టర్ కే.సుబ్రహ్మణ్యశాస్త్రి, కే.ప్రభాకర్‌ను అసోసియేషన్ సత్కరించింది. కార్యక్రమానికి పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు మాజేటి సోమశేఖర్ అధ్యక్షత వహించారు. కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణ మూర్తి మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సంఘం ఎంతో దోహదపడుతుందని తెలియజేశారు. ప్రిన్సిపల్ పి.ఎం. ప్రసాద్ మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు ప్రస్తుతం అభ్యసిస్తున్న వారికి ప్రేరణగా ఉండటం వారిలో స్ఫూర్తి నింపుతుందన్నారు. పూర్వ విద్యార్థుల సంఘ కార్యదర్శి, వైస్ ప్రిన్సిపల్ కెవిఎస్ దుర్గాప్రసాద్ నివేదిక సమర్పించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులచే ప్రకటించిన మెడిటోరియస్ అవార్డులను ప్రస్తుత విద్యార్థులకు అసోసియేషన్ వారు అందించారు. కార్యక్రమాన్ని డాక్టర్ వై.గౌరీ శంకర్ ప్రారంభించారు.ఆటల పోటీల్లో గెలుపొందిన పూర్వ విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు.కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ఎన్.సత్యనారాయణ పాల్గొన్నారు.

హరిప్రసాద్‌రాజును సత్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

అక్రమాలకు అవినీతే ఆధారం

అవినీతి వ్యతిరేక కవి సమ్మేళనంలో వక్తలు

ప్రజాశక్తి-గుంటూరు

దేశంలో జరుగుతున్న అన్యాయాలకు, అక్రమాలకు ప్రధాన కారణం అవినీతి అని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌ఒ సమావేశ మందిరంలో అమరావతి సాహితీ మిత్రులు అధ్యక్షులు డాక్టర్ రావి రంగారావు అధ్యక్షతన కవి సమ్మేళనం నిర్వహించారు. ఆప్ నాయకులు డాక్టర్ టి.సేవాకుమార్ కవి సమ్మేళన నేపథ్యాన్ని వివరిస్తూ ప్రతి ఏటా అవినీతి వ్యతిరేక కవితల పోటీ నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ సాహితీవేత్త రావెల సాంబశివరావు కవితల పోటీ విజేతలకు బహుమతులు అందజేశారు. విజయనగరం జిల్లాకు చెందిన జాగరాపు శంకరరావు ప్రధమ బహుమతి (రూ.5వేలు), శ్రీకాకుళం జిల్లాకు చెందిన కుప్పిలి వెంకట రాజారావు రెండో బహుమతి (రూ.3వేలు), పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన దుర్గం సునీత తృతీయ బహుమతి (రూ.2వేలు) సాధించారు. నాగార్జున సాగర్‌కు చెందిన సరికొండ నరసింహరాజు ప్రత్యేక బహుమతి అందు కున్నారు. పింగళి భాగ్యలక్ష్మి నిర్వహించిన కవి సమ్మేళనంలో డాక్టర్ మైలవరపు లలితకుమారి, తాటికోల పద్మావతి, షేక్ కాసింబి, సయ్యద్ జానీ బాషా, సుబాని, ఇడపలపాటి చంద్రయ్య, ఇంకా రాష్ట్రవ్యాప్తంగా పలువురు కవులు పాల్గొన్నారు. యర్రగుంట్ల పాణిరావు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

విజేతలను అభినందిస్తున్న రావెల సాంబశివరావు తదితరులు